
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

ఆదివారం 27 అక్టోబరు 2024

కార్పొరేషన్ అధికారులపై కేసు

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించనందుకు కోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు కార్పొరేషన్ అధికారులపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... కరోనా సమయంలో సంతపేట మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన పెండాల్స్ (షామియానాలు)కు అద్దె ఇవ్వని కారణంగా బాధితుడు విజయ శంకర్ కోర్టును ఆశ్రయించాడు. 2019-21 రెండేళ్ల కాలానికి రూ.45 లక్షలకు పైగా బిల్లుకాగా, రూ. 2.18 లక్షలు మాత్రమే చెల్లించేలా తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించినట్లు బాధితుడు కోర్టుకు ఫిర్యాదు చేశాడు. దీంతో కోర్టు ఆదేశాలతో అప్పటి కమిషనర్లు, అధికారులపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.



భలే ఉందే!

ఆకట్టుకున్న 'పోలీస్ ఓపెన్ హౌస్'

కరుడుగట్టిన నేరగాళ్లను పోలీసులు ఏవిధంగా ఎదుర్కొంటారో మీరు గమనించారా!? విపత్కర పరిస్థితుల్లో వాడే ఆయుధాలు ఏవో మీకు తెలుసా!? నేరం జరిగిన ప్రదేశాల్లో నిందితుల ఆనవాళ్లను క్లూస్‌టీం ఏవిధంగా గుర్తిస్తుంది. బాంబ్‌ను ఏవిధంగా డిస్పోజ్ చేస్తారు.. డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరు ఎలా ఉంటుంది ఈ వివరాలన్నీ కళ్లకు కట్టినట్టు చూపించారు జిల్లా పోలీసులు. నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో శనివారం జరిగిన 'పోలీస్ ఓపెన్ హౌస్' ప్రజలను, విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. తుపాకుల్లో ఎన్ని రకాలు ఉంటాయో.. వాటిల్లో నుంచి బుల్లెట్లు ఏవిధంగా దూసుకువస్తాయో... వాటి పనితీరును పోలీస్ అధికారులు కళ్లకు కట్టినట్లు వివరించారు.

6





తిన్నంత భోజనం..
తరగని రుచి

- ఇదీ కోమల విలాస్ ప్రత్యేకం

కోమలా విలాస్.. నెల్లూరులో ఈ హోటల్ పేరు తెలియనివారంటూ ఉండరు. నెల్లూరుకు అతిథులు వచ్చినా.. ఇక్కడ నుంచి బయట ప్రాంతాలకు వెళ్లినా!? 'కోమలా'లో భోజనం చేశారా!? అని ప్రశ్నించే వాళ్లే ఎక్కువగా ఉంటారు. అంత బాగుం టుందన్నమాట ఇక్కడ భోజనం. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ హోటల్ ఇప్పటికీ రుచికి, శుచికి పేరు గడిస్తూనే ఉంది. అందుకే కాబోలు అభిమానుల సంఖ్య రెట్టింపు అవుతూనే ఉంది.

6



సర్ చార్జ్

వైసీపీ ప్రభుత్వం పాపం.. ప్రజల పాలిట శాపం	ఇంటి కరెంటు బిల్లుపై మరో బాదుడు	యూనిట్‌కు రూ.1.21 చొప్పున అదనపు వడ్డన	నవంబరు నుంచే అమలులోకి	జిల్లావాసులపై నెలకు రూ.20 కోట్ల భారం

నెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు సంస్థల నుంచి ఎడాపెడా కరెంటు కొనుగోలు చేయడం, ఏపీ జెన్కో కంపెనీల్లో విద్యుత్ ఉత్పత్తిని కుదించి వేయడంతో ఇప్పుడు ప్రజలపై సర్దుబాటు చార్జీల రూపంలో అదనపు భారం పడనుంది. ఈ క్రమంలో జిల్లా గృహ విద్యుత్ వినియోగదారులపై 2022-23 విద్యుత్ సర్దుబాటు చార్జీల కింద ఒక యూనిట్‌కు రూ.1.21 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. నవంబరు నెల నుంచే ఈ అదనపు చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే రెండు సర్దుబాటు చార్జీల రూపంలో ఒక యూనిట్‌పై రూ.1.05 చెల్లిస్తున్న వినియోగదారులు వచ్చే నెల నుంచి అదనంగా మరో రూ.1.21 చెల్లించాల్సి ఉంటుంది. అంటే నవంబరు నుంచి సర్‌చార్జీల భారం ఒక యూనిట్‌పై రూ.2.26 భారం పడుతుంది.

రూ.20.40 కోట్ల అదనపు భారం

విద్యుత్ కొనుగోలుకు, విక్రయానికి మధ్య వ్యత్యాసపు ధరను సర్దుబాటు చార్జీల రూపంలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. ఈ క్రమంలో 2022-23 సర్దుబాటు చార్జీల రూపంలో ఒక యూనిట్‌కు ఒక్క రూపాయ 21 పైసలు చొప్పున వసూలు చేసుకోవడానికి డిస్కంకు ఏపీఈఆర్‌సీ అనుమతి ఇచ్చింది. నవంబరు నుంచి ఈ అదనపు బాదుడు ఆరంభం కానుంది. జిల్లాలో 11,94,474 గృహ విద్యుత్ సర్వీసులు ఉండగా, నెలకు 19.50 కోట్ల యూనిట్ల విద్యుత్ వాడుతున్నారు. ఈ మొత్తం యూనిట్లపై 2022-23 సర్దుబాటు చార్జీల రూపంలో ఒక యూనిట్‌పై రూ.1.21 అదనంగా వసూళ్లు చేయనున్నారు. అంటే ఎల్టీ సర్వీసుదారులు నెలకు సుమారుగా 20 కోట్ల రూపాయలను సర్దుబాటు చార్జీల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలను 12 నెలలపాటు వసూలు చేస్తారు. అంటే ఏడాదికి రూ.240 నుంచి 280 కోట్ల వరకు జిల్లా వినియోగదారులపై అదనపు భారం పడనుంది.

> గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేసిన పాపం వైసీపీ అధికారానికి దూరమైనా రాష్ట్ర ప్రజలను మాత్రం వదిలిపెట్టలేదు. సర్దుబాటు చార్జీల రూపంలో మూడేళ్లుగా రాష్ట్ర ప్రజలకు షాక్ ఇస్తూనే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. ఇక కరెంటు బిల్లులు షాక్‌లు కొట్టవని ప్రజలు ఊపిరి పీల్చుకొంటున్న తరుణంలో అప్పట్లో వైసీపీ పాలకులు చేసిన పాపం ప్రజల పాలిట శాపంగా మారి మరోసారి కరెంటు బిల్లుల రూపంలో వారి కష్టార్జితాన్ని కొల్లగొట్టడానికి సిద్ధమయ్యాయి.

ఇది వైసీపీ పాపమే!

విద్యుత్ కొనుగోళ్లలో గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా రాష్ట్ర ప్రజలు ఒక యూనిట్‌పై (మూడు సర్దుబాటు చార్జీలు కలిపి) రూ.2.26 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో ఏపీ జెన్కో రంగ సంస్థల్లో విద్యుత్ ఉత్పత్తిని తగ్గించడం, ప్రైవేటు రంగ సంస్థల నుంచి భారీ రేట్లకు కొనుగోలు చేయడం, బొగ్గు కొనుగోలు వ్యవహారాలు, ప్రైవేటు కంపెనీల నుంచి కొనుగోలు రేట్ల వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచడం తదితరాలు అప్పట్లో విద్యుత్ కొనుగోళ్లలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పుడు సర్దుబాటు చార్జీల రూపంలో వినియోగదారులు ఒక యూనిట్‌కు 2.26 రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏదిఏమైనా గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ విధానాల కారణంగా జిల్లా ప్రజలకు నెలకు రూ.44 కోట్లు, ఏడాదికి 528 కోట్ల రూపాయలను సర్దుబాటు చార్జీల రూపంలో చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది.



ఆ ఆలయాలు అద్భుతః

- పొదలకూరులో విరాళాలతో శ్రీవారి ఆలయాలు
- ఎక్కడాలేని విధంగా రాతితో నిర్మాణం
- ఆకట్టుకుంటున్న శిల్పసౌందర్యం

వారంతా శ్రీవారి భక్తులు. చేయి చేయి కలిపారు. విరాళాలు సేకరించారు. ఆలయాన్ని నిర్మించారు. అదీ ఒక్కటి కాదు.. రెండు ఆలయాలను అద్భుత రాతికట్టడంతో అపురూపంగా తీర్చిదిద్దారు. నిత్యపూజలతోపాటు పర్వదినాలలో ప్రత్యేక పూజలు ఇక్కడ జరుగుతుంటాయి. పొదలకూరుకు వన్నె తెచ్చిన ఆ ఆలయాల గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

6

రిజిస్ట్రేషన్లకు స్టాంపులు
వచ్చేశాయ్!

- జిల్లాకు రూ. 1.20 కోట్ల విలువైన స్టాంపులు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీరనుంది. రూ.1.20 కోట్ల విలువైన రూ.100, 50 స్టాంపులను కూటమి ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. రిజిస్ట్రేషన్లకు ఫిజికల్ స్టాంప పేపర్లు అవసరం లేదని, ఈ స్టాంపులు వాడాలంటూ గత వైసీపీ ప్రభుత్వం అధీకృత కలెక్షన్ సెంటర్‌లను ఏర్పాటు చేయించి విక్రయాలు సాగేలా చేసింది. దీంతో ఈ స్టాంపింగ్ పేపర్లపై అక్షరాలు కొద్దిరోజులకే చెరిగి పోతాయంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాన్ జ్యుడీషియల్ స్టాంపులపై దృష్టి సారించి వినియోగదారులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. జిల్లాలో సంవత్సరానికి 10 లక్షలకుపైగా స్టాంపుల అవసరం ఉండగా, స్టాంపుల రాకతో వినియోగదారుల కష్టాలు తీరనున్నాయి. జిల్లాకు వచ్చిన స్టాంపులను రెండు రోజుల్లో అన్నీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



కావలి : బీద రవిచంద్రకు సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం : అజీజ్ నుంచి పార్టీ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

'పల్లె పండుగ' సమాచారం ఏదీ..

జడ్పీ చైర్‌పర్సన్ సహా సభ్యుల ఆగ్రహం

ప్రొటోకాల్ తెలియదా!?

- అలా జరగకుండా చూస్తాం : పీఆర్ ఎస్‌ఈ
- గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిపెట్టండి : చైర్‌పర్సన్
- వాడీవేడిగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 26 (ఆంధరజ్యోతి) : 'ఇటీవల జరిగిన పల్లెపండుగ కార్యక్రమాల నిర్వహణపై కనీస సమాచారం లేదు. ఏం ప్రొటోకాల్ తెలియదా!?' అంటూ జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సహా జడ్పీటీసీ సభ్యులు పంచాయతీ రాజ్ ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏడు స్థాయీసంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా పల్లెపండుగపై తమకు సమాచారం ఇవ్వలేదని కొండాపురం జడ్పీటీసీ సభ్యుడు వై.వెంకటరావు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఎస్‌ఈ అశోక్‌కుమార్‌ను ప్రశ్నించారు. చైరపర్సన్ కూడా తనకు సమాచారం ఇవ్వలేదని ప్రస్తావించారు. ఎస్‌ఈ సమాధానమిస్తూ ఇకపై సమాచారం సకాలంలో అందచే స్తామని, ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటిస్తామని చెప్పారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై దృష్టి సారించాలని ఆదేశించారు. మురుగుకాలువల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా వివిధ శాఖల ప్రగతిపై ఈ సమావేశంలో చర్చించారు. జడ్పీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌కు సంబంధించి తొలివిడతలో రూ.41.75కోట్లు, రెండో విడతలో 41.75 కోట్లు విడుదలయ్యాయని జిల్లా పంచాయ తీ అధికారి శ్రీధర్‌రెడ్డి సమావేశంలో చెప్పారు. ఈ వివరాలు విన్న జడ్పీటీ సీ సభ్యులు బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు. నిధులు విడుదల య్యాయని, గ్రామ పంచాయతీల తీర్మానంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. పంచాయతీల్లో వచ్చే పన్నులతో సిమెంటు రోడ్లు ఇతర అభివృద్ధి పనులు చేయిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని చిల్లకూరు, చిట్టమూరు మండ లాల్లో అటవీ అనుమతులు వచ్చిన చోట్ల రోడ్లు తదితర పనులు చేప ట్టాలని కోరారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. సోలార్ విద్యుత్ దీపాలు, జిల్లాలో వ్యవసాయ పంటల సాగు, ఆర్‌అండ్‌బీ రోడ్లు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ మోహన్‌రావు, జడ్పీటీసీలు, ఉమ్మడి నెల్లూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జడ్పీ స్థాయి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

తొలిరోజే అట్టహాసంగా!


- టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు

నెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు శనివారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఎమ్మెల్యేలు, పలువురు ప్రముఖులు సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొని, పార్టీ సభ్యత్వం స్వీకరించారు. మండల పార్టీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సారథ్యం వహించగా ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ సభ్యత్వం స్వీకరించారు.

- బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. భర్త ఎంపీ వేమిరెడ్డి, కుమారుడు అర్జున్‌రెడ్డిల తరఫున ఎమ్మెల్యే సభ్యత్వ నమోదు పత్రాలు స్వీకరించారు.
- కావలిలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే, బీద రవిచంద్రలు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం స్వీకరించారు.
- నెల్లూరులోని వేదాయపాళెం వద్ద టీడీపీ కార్యాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. వెంకటాచలం, ముత్తుకూరు, టీపీ గూడూరుల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు సభ్యత్వం అందుకున్నారు
- ఉదయగిరిలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు.
- కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సభ్యత్వ నమోదును ప్రారంభించగా, టీడీపీ నేత వెంకటేశ్వర్లు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.



నెల్లూరులో మాట్లాడుతున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



గన్ చేతబట్టిన ఎస్పీ కృష్ణకాంత్

మా ఆయుధాలు ఇవే!

- నేరస్థులను, విపత్తులను వీటితోనే ఎదుర్కొంటాం
- విద్యార్థులకు వివరించిన ఎస్పీ కృష్ణకాంత్
- ఆకట్టుకున్న 'పోలీస్ ఓపెన్ హౌస్'

• పోలీసు స్టేషన్లలో సీఐలు, ఎస్ఐలు వాడే పిస్టోల్ గురించి మీకు తెలుసా? ఒక్కసారి లోడ్ చేస్తే చాలు పది రౌండ్లు నేరుగా కాల్చే అవకాశం ఉంటుంది.

• ఇక మనం సినిమాల్లో పదే పదే వినే పదం ఏకే 47. దీని గురించి మీకు తెలుసా!? ఇది గన్ కాదు రైఫిల్. ఒక్కసారి లోడ్ చేస్తే చాలు సింగిల్, ఆటో ఆప్షన్‌లో ఫైర్ చేసే అవకాశం ఉంటుంది. దీని మెగ్జిన్ కెపాసిటీ 30 రౌండ్లు, వెపన్ చిన్నగా ఉన్న దీని రేంజ్ 60 గజాలు ఉంటుంది.

• నెం.1 మార్క్-3 పాయింట్ 303, నెం.4 మార్క్-1 పాయింట్ 303 ఈ రెండు ఇంచ్ రైఫల్ ఇది ప్రతి రౌండ్‌కు లోడింగ్ చేసి ఫైరింగ్ చేయాల్సి ఉంటుంది. 300 గజాలు దూరంలో టార్గెట్‌ను అందుకుంటుంది.

• 7.62 ఎంఎం ఎస్ఎల్ఆర్ రైఫిల్ ఒక్కసారి లోడ్‌చేస్తే అందులోని 20 మాగ్జైన్‌కు 20 రౌండ్లు ఉండగా ప్రతిసారి లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా స్టిగ్గర్ నొక్కుకుంటూ పోతే గన్‌లో నుంచి బుల్లెట్ దూసుకెళుతుంది. ఈ రైఫల్ ఫైరింగ్ రేంజ్ 300 నుంచి 600 గజాలు ఉంటుంది.

• మిషన్ కార్బైన్ 9ఎంఎం దీనిని ఎక్కువగా వీవీపీ ఎక్స్‌కార్ట్ ఉద్యోగులు ఉపయోగిస్తారు. ఒక్కసారి లోడ్ చేసే సింగిల్‌లో, ఆటోలు ఫైర్ చేసే అవకాశం ఉంటుంది. దీని రౌండ్ 30 నుంచి 50 గజాల దూరం.



పిల్లలూ.. పిస్టోల్ ఇలా ఉంటుంది!

పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం పోలీసు కవాతు మైదానంలో నిర్వహించిన పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రజలను, విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ఎస్పీ కృష్ణకాంత్ విద్యార్థులతో ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, బాంబు డిస్‌పోల్ టీం పరికరాలు, డ్రోన్, డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరు, ట్రాఫిక్ విభాగం, కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ వాడే విధానం, విపత్తుల సమయంలో పోలీసుల కమ్యూనికేషన్ చేసే తీరును విద్యార్థులకు ఎస్పీ వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను వివరించి అందరూ మంచి ప్రవర్తనతో జీవించాలని, మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపుఎస్పీలు సౌజన్య మునిరాజా, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



ఎస్పీకి గౌరవ వందనం చేస్తున్న పోలీస్ డాగ్

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

లైసెన్సుదారులే బాణసంచా విక్రయించాలి

• ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు కలిగిన వ్యాపారులు మాత్రమే బాణసంచా విక్రయాలు జరపాలని, ప్రమాదాలకు తావు లేకుండా సరైన భద్రత, ప్రమాణాలు పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో శనివారం పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. సర్కిల్ వారీగా నేరాలపై అధికారులతో సమీక్ష జరిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్ల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య జీ మునిరాజా, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు

• 3 నుంచి శ్రీశైలం, అరుణాచలం సర్వీసులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో సోమవారం నాడు ఒకే రోజు పంచారామ క్షేత్రాల దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, అలాగే అరుణాచలం గిరి ప్రదక్షిణకు నెల్లూరు 1వ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆ డిపో మేనేజర్ మురళీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. పంచారామ క్షేత్ర దర్శనానికి నవంబరు 3, 10, 17, 24 తేదీలలో రాత్రి 9 గంటలకు నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి బస్సు బయల్దేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు రూ. 2500 చార్జీ వసూలు చేస్తారని, మినరల్ వాటర్ బాటిల్, పసుపు, కుంకుమ, ఒక బిస్కెట్ ప్యాకెట్ ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు ఆర్టీసీ బస్టాండ్‌లోగానీ, అధీకృత వ్యక్తుల నుంచి గానీ టికెట్లు పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్ కావలసిన వారు 46480 సర్వీస్ నెంబరుపై రిజర్వేషన్ పొందవచ్చన్నారు. నవంబరు 3వ తేదీ నుంచి ప్రతీ రోజు రాత్రి 9.15 నిమిషాలకు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి శ్రీశైలంకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని తెలిపారు.

అరుణాచలానికి బస్సులు

కార్తీక మాసం సందర్భంగా నవంబరు 3,9,10,14,17,24, డిసెంబరు 1 తేదీలలో ఉదయం 9 గంటలకు నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి అరుణాలచల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు బయల్దేరుతాయని డీఎం తెలిపారు. ఆ బస్సులు మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు తిరుగు ప్రయాణమై నెల్లూరుకు చేరుకుంటాయన్నారు. ఈ యాత్రకు రూ. 1200 చార్జీ వసూలు చేస్తారన్నారు.

నెల్లూరులో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు లేకుండా

బిల్డర్లకు మార్ట్‌గేజ్ డీడ్‌ల విడుదల

- విచారణ జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించండి
- హైకోర్టులో పిల్ దాఖలు

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కార్పోరేషన్ పరిధిలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే బిల్డర్లకు మార్ట్‌గేజ్‌డీడ్‌లు విడుదల చేసిన వ్యవహారంపై విచారణ జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఈ పిల్ దాకలు చేశారు. నెల్లూరులో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లు నివాసయోగ్యమైనవా?కాదా? అనే విషయాన్ని పరిశీలించకుండానే జూన్ 2019- జూన్ 2024 మధ్య అప్పటి కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయడంతోపాటు బిల్డర్లకు మార్ట్‌గేజ్ డీడ్‌లు విడుదల చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన అప్పటి కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్ పై విచారణ జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, అవినీతి నిరోధకశాఖ డీజీ, నెల్లూరుజిల్లా కలెక్టర్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్, నెల్లూరు జిల్లా ఎస్పీ, నెల్లూరు పూర్వ మున్సిపల్ పూర్వకమిషనర్లు, ఐఏఎస్ అధికారులు డి.హరిత, వికాస్ మర్మత్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ డి.చందును ప్రతివాదులుగా చేర్చారు.

తిన్నంత భోజనం..

తరగని రుచి

- ఇదీ కోమల విలాస్ ప్రత్యేకం
- 88 ఏళ్ల చరిత్ర.. తగ్గని అభిమానం
- రాష్ట్రానికే వన్నె తెచ్చిన శాకాహార భోజనశాల

నెల్లూరులో కోమలావిలాస్ అంటేనే తెలియనివారుండరు. శతాబ్దాల తరబడి భోజన ప్రియుల ఆదరాభిమానాలను చూరగొంటున్న ఈ హోటల్‌ను ట్రంకురోడ్డులో 1936లో వెంకటాచలం అయ్యర్, శారదమ్మలు ప్రారంభించారు. తర్వాత శ్రీనివాసన్, ప్రస్తుతం ఈయన కుమారుడు కోమల ప్రసాద్, అన్నపూర్ణలు నిర్వహిస్తున్నారు. దాదాపు 88 సంవత్సరాలుగా తెలుగింటి కూరలుతోనే భోజనం వడ్డిస్తున్నారు. తొలినాళ్లలో ఇక్కడ భోజనం అణాతో మొదలైంది. 1984 నాటికి ఒకరికి భోజనం ధర రూ.3.75లకు చేరింది. ఆ తర్వాత ముడిసరుకుల ధరల పెంపుతో ఇక్కడ భోజనం ధర కూడా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఫుల్ భోజనం రూ.110, ప్లేట్ భోజనం రూ.80.

• ఇవీ ప్రత్యేకం

ఆదివారం రాగి సంగటి, ఉల్లి పాయ పులుసు, వెజ్‌బిరియాని, సోమవారం వంకాయి మునగ కాయ ముద్దకూర, మంగళవారం వడపులుసు, బుధవారం అవ్యల్ (కేరళ వంటకం), గురువారం నూనె వంకాయ కూర, శుక్రవారం ముక్కల పులుసు, శనివారం చింతపండు పులిహోర ఇక్కడ ప్రత్యేకం. వీటితోపాటు రైస్, పప్పుకూర, తాళింపు, పచ్చడి, సాంబార్, రసం, మజ్జిగ పులుసు, పెరుగు, మజ్జిగ, ఊరగాయ, శనగలపొడి, స్వచ్ఛమైన నెయ్యితో వడ్డిస్తారు.

• ప్రముఖులూ అభిమానులే

కోమలా విలాస్ అభిమానుల్లో ప్రముఖులూ ఉన్నారు. పూర్వ ఉప రాష్ట్రపతి ముప్ప వరపు వెంకయ్య నాయుడు విద్యార్థి దశ నుంచే కోమల విలాస్ భోజనం చేసినవారే. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుతోపాటు మాజీ ముఖ్యమం త్రులు, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు కోమలా విలాస్‌లో భోజనం చేసిన వారే.

- నెల్లూరు (సాంస్కృతికం)



కోమల విలాస్ వ్యవస్థాపకులు వెంకటాచలం అయ్యర్, శారదమ్మ



హోటల్‌లో భోజనం వడ్డిస్తున్న సిబ్బంది



3న కాపు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బలిజ (కాపు) భవన్‌లో నవంబరు 3వతేదీన బలిజ, తెలగ, కాపు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు కార్యనిర్వాహకులు బీస్ అధ్యక్షుడు పీఎస్ అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు, డాక్టర్ పోకల రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023- 24 విద్యా సంవత్సరానికి సంబందించి తల్లిదండ్రులు లేని విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్ పాసై ఉంటే రూ.10వేలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి 10వ తరగతిలో 550 మార్కులు, ఇంటర్‌లో 950 మార్కులు సాధించిన వారికి రూ.5వేలు, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన వారికి రూ.2500 చొప్పున అందజేస్తామన్నారు. ఎంబీబీఎస్, ఐఐటీ, ఐఐఐటీ, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానిస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు 94919 23117, 94405 10891, 97046 45469 ఫోన్ నెంబర్లకు వివరాలు తెలపాలని కోరారు.

నేడు యథావిధిగా

విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యుత్ బిల్లులు వసూలు చేసే అన్ని కేంద్రాలు ఆదివారం సెలవు దినం అయినప్పటికీ యథావిధిగా పని చేస్తాయని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

జిల్లాను క్షయ రహితంగా మార్చాలి

• వైద్యులు, సిబ్బందిదే బాధ్యత : కలెక్టర్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు వైద్యాధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శనివారం తిక్కన భవన్‌లో జిల్లా స్థాయి క్షయ ఫోరం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో క్షయ వ్యాధి వల్ల ఒక్క మరణం కూడా సంభవించకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఆ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు ఉన్నవారు తప్పని సరిగా గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. ఆశావర్కర్లు, గ్రామీణ ప్రాంతాల్లోని ఏఎన్ఎంలు గళ్ల శాంపిల్స్ సేకరణలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు, వసతిగృహాలు, పాఠశాలలు ఉండే ప్రాంతాల్లో క్షయ పరీక్షలపై దృష్టిపెట్టాలన్నారు. క్షయ వ్యాధి నివారణ చర్యలను క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 64 శాతం బీసీజీ వ్యాక్సిన్ వేసి జిల్లా ముందంజలో ఉన్నట్లు తెలియచేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, ఐఎంఏ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అశోక్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ భవానీ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లూరు(విద్య), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షల ఫీజులు చెల్లించాలని డీఈవో ఆర్ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110 చెల్లించాలని పేర్కొన్నారు. ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60, వయసు మినహాయింపు కోరేవారు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చెల్లించాలని తెలిపారు. ఈ ఫీజులను ఈనెల 28 నుంచి నవంబరు 11వతేదీలోపు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో నవంబరు 12 నుంచి 18 వరకు, రూ.200 అపరాధ రుసుముతో నవంబరు 19 నుంచి 25 వరకు, రూ.500 అపరాధ రుసుముతో నవంబరు 26 నుంచి 30వతేదీ వరకు చెల్లించవచ్చన్నారు. విద్యార్థులు చెల్లించే పరీక్ష ఫీజులను జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 28 నుంచి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాలని ఆదేశించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను గానీ, నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ పరీక్షల విభాగంలోగానీ సంప్రదించాలని కోరారు.

గర్భిణులు, పిల్లలకు

మెరుగైన వైద్యం అందించాలి

• బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



చిన్నపిల్లలకు అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకుంటున్న పద్మావతి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో గర్భవతులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి ఆదేశించారు. శనివారం జీజీహెచ్‌లోని ప్రసూతి, చిన్నపిల్లల విభాగాలను ఆమె పరిశీలించారు. బాధితులకు అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అవసరమైతే తప్ప సిజేరియన్ కాన్పు చేయరాదని వైద్యులకు సూచించారు. అనంతరం గాయత్రి నగర్‌లో ఉన్న రత్నం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

ఆ ఆలయాలు

అద్భుతః



శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం

- పొదలకూరులో విరాళాలతో శ్రీవారి ఆలయాలు
- ఎక్కడాలేని విధంగా రాతితో నిర్మాణం
- ఆకట్టుకుంటున్న శిల్పసౌందర్యం

పొదలకూరులో కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని కొంతమంది భక్తులు పూనుకుని అనతికాలంలోనే జిల్లాలో ఎక్కడా లేని విధంగా అద్భుతంగా తీర్చిదిద్దారు. ఒక్క ఆలయం నిర్మిద్దామని పూనుకున్న వారు కొన్ని కారణాల వల్ల పోటీపోటీగా రెండు ఆలయాలను నిర్మించారు. వీటిలో ఒకటి పట్టణంలోని శ్రీనివాస లే అవుట్‌లో ఉంటే మరొకటి అయ్యప్పనగర్‌లో ఉంది. భక్తుల విరాళాలతో చేపట్టిన ఏడుకొండల వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం ఏడేళ్లలో పూర్తి కావడం, ఏడేళ్లు దాటకముందే ప్రారంభానికి నోచుకోవడాన్ని భక్తులు విశేషంగా చెప్పుకుంటున్నారు.

• శ్రీనివాసనగర్ లే అవుట్‌లో 2015, జూన్ 11వతేదీన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీ రామచంద్ర జీయర్ స్వామి శంకుస్థాపన చేశారు. వెంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదాదేవి అమ్మవార్లతోపాటు శ్రీ గరుడ ఆళ్వార్ స్వామి ఆలయాలను నిర్మించారు. ఈ ఆలయాల నిర్మాణం మొత్తం రాతితో చేపట్టారు. ప్రతివారం స్వామివారికి పల్లకి సేవలు, ప్రతి నెల శ్రవణా నక్షత్రం రోజున శ్రీవారి కల్యాణం, ప్రతి శనివారం స్వామి వారికి పల్లకీసేవతోపాటు శుక్రవారం అమ్మవార్లకు అభిషేకాలు జరుగుతాయి. ముక్కోటి ఏకాదశినాడు ఉత్తర ద్వార దర్శనం, ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక ప్రతిరోజు భక్తులకు అన్నదానంతోపాటు ఆలయ ప్రాంగణంలో 22 ఆవులతో గోశాల నిర్మించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆలయ ప్రాంగణంలో తలనీలాలు సమర్పించుకుని, శ్రీవార్లను దర్శించుకుంటారు. కాగా, ప్రస్తుతం రూ.40 లక్షలతో శ్రీవారికి రథ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2025, మే నెలలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఈ రథాన్ని అందుబాటులోకి తెస్తారు.



ఆకట్టుకుంటున్న రాతికట్టడం

• పట్టణంలోని అయ్యప్పనగర్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం 2023, జనవరి 27వ తేదీన ప్రారంభమైంది. అల్లూరు రమణయ్య అనే అయ్యప్ప భక్తుడు 17ఏళ్ల క్రితం బాలాలయాన్ని నిర్మించారు. ఏడేళ్ల క్రితం రూ.4 కోట్ల విరాళాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఎక్కడా లేనివిధంగా కల్యాణ వెంకటేశ్వర స్వామితోపాటు పరివార దేవతలుగా విఘ్నేశ్వరుడు, ఆంజనేయుడు, అయ్యప్ప, శివయ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. శ్రీనివాసుడికి నిత్యకైం కర్యాలు, కల్యాణోత్సవాలతోపాటు అన్నదానం చేపడుతున్నారు. వీటితోపాటు యేటా మకర సంక్రాంతి రోజున అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం, అయ్యప్ప మాలాదారులకు అన్నదానం, భజన కార్యక్రమాలు జరుగుతాయి.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)



రథం తయారీలో చెక్కతో చేసిన శిల్పాలు



అయ్యప్పనగర్‌లోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం



పేరుకే జాతీయ రహదారి..

సంగం మండలకేంద్రంలోని ముంబాయి జాతీయ రహదారి ఇది. పేరుకే ఇది రహదారి స్థానిక బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో కెనరా బ్యాంకు సమీపంలోని ఈ రోడ్డులో మోకాలులోతు గుంతలో పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతల్లో నీరు నిలిచి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టక పోవడంతో ఈ దుస్థితి నెలకొంది.

- సంగం(ఆంధ్రజ్యోతి)

పన్ను కట్టనందుకు పవర్ కట్ !

నెల్లూరు కార్పొరేషన్‌కు ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు చెందిన విద్యుత్ కనెక్షన్‌ను అధికారులు కట్ చేశారు. ట్రంకురోడ్డు, అరవింద నగర్, శ్రీహరినగర్ ప్రాంతాల్లోని పలు వాణిజ్య సముదాయాలకు విద్యుత్ శాఖతో కలిసి శనివారం కరెంట్ కనెక్షన్లను తొలగించారు. ఆస్తి పన్ను భారీగా పేరుకుపోగా పలుమార్లు డిమాండ్ నోటీసులిచ్చినా స్పందించక పోవడంతో ఈ చర్యలకు ఉపక్రమించారు. ఈ పరిణామం వ్యాపార వర్గాల్లో కలవరం రేపింది.

- నెల్లూరు సిటీ, (ఆంధ్రజ్యోతి)



వీఎస్‌యూ అభివృద్ధికి సహకరించండి

● ఉపకులపతి విజయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) అభివృద్ధికి అందరి సహకారం అవసరమని వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను వీసీగా బాధ్యతలు స్వీకరించి వందరోజులు పూర్తి అయిందన్నారు. యూనివర్సిటీ స్థితిగతులను, అధ్యాపకుల పనితీరు, నెలకొన్న సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నట్లు వివరించారు. ప్రధానంగా డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణత పొందలేని విద్యార్థులకు చివరి అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. 14 ఏళ్ల కిందట డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణత కాలేనివారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. అలాగే 77309 43084 హెల్ప్‌లైన్ నెంబర్‌ను కూడా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి, డాక్టర్ పీ సుజాత, డాక్టర్ ఏ శివశంకర్ రెడ్డి, డాక్టర్ శ్రీకన్యరావు, డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత ఇసుక ఇస్తుంటే
మీకెందుకు కడుపు మంట!

● చివరి సంవత్సరంలో 'అమ్మఒడి'ని ఎగ్గొట్టలేదా?

● వైసీపీ నేతల బతుకంతా అబద్ధాలే!

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ నేత కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : 'రాష్ట్రంలో పేదలకు ఉచితంగా ఇసుక ఇస్తుంటే మీకెందుకు కడుపు మంట' అని వైసీపీ నేతలపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైసీపీ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుకను రూ. 15వేలకు అమ్ముకున్నారంటూ మండిపడ్డారు. అయితే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.1500లకే పేదలకు అందుబాటులో ఉందని వెల్లడించారు. నాలుగు నెలల తర్వాత ఇంట్లో నుంచి బయటకు వచ్చిన వైసీపీ నేతలు ఇసుకపై మాట్లాడుతూ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం కక్ష సాధిస్తోందని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. తాము కక్ష సాధింపు చర్యలకు దిగితే వైసీపీ నేతలు ఇంటినుంచి బయటకు వచ్చే వారా!? అంటూ నిలదీశారు. అమ్మఒడి కింద ఏడాదికి రూ. 15వేలు ఇస్తామని చెప్పి మొదట ఏడాది రూ. 14వేలు, రెండవ ఏడాది రూ.13వేలు ఇచ్చి చివరి ఏడాది అమ్మఒడి ఎగ్గొట్టారని గుర్తుచేశారు. కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వక పోవటంతో టీసీలు రాక పిల్లలు గగ్గోలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ ఇక అధికారంలోకి రాదని భావించిన ఆ పార్టీ నేతలు టీడీపీ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకుని ప్రవర్తించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మామిడాల మధు, కువ్వారపు బాలాజీ, అంచూరి శ్రీనివాసులనాయుడు, జహీర్, మొయిద్దీన్, కేపీ చౌదరి, తంబీ, సుజన్, నారాయణరెడ్డి, సుధా తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించాలని
వివాహితుడి వేధింపు

● బాలిక ఆత్మహత్యాయత్నం

నెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లికి చెందిన 17ఏళ్ల బాలిక శనివారం మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలి పిన వివరాల మేరకు.. లింగంగుంటకు చెందిన హసన్ అనే వివాహితుడు ఆ బాలికతో గతంలో సన్నిహితంగా ఉంటూ సెల్‌ఫోన్‌లో వీడి యోలు తీసుకొన్నాడు. వాటిని అడుపెట్టు కొని తనను ప్రేమించాలని వేధిస్తుడ డంతో ఆ బాలిక ఇంట్లో నిల్వ ఉన్న మాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. తల్లి యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7581
వెండి కిలో ధర	రూ. 100,800
వెండి ఒక గ్రాము	రూ.103.80

● యథేచ్ఛగా సీజేఎఫ్ఎస్, జలాశయ ముంపు ప్రాంత భూముల ఆక్రమణ

● జామాయిల్, మినుము సాగుకు సిద్ధం

● మెట్టలో రెచ్చిపోతున్న అక్రమార్కులు

కన్నేశారు... కబ్జా చేశారు !

ఉదయగిరి రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో భూక బ్జాదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు సాగుకు సన్నద్ధమవుతు న్నారు. అధికారం ఉన్నా, లేకపోయినా కొందరు అక్రమార్కులు రాజకీయ పలుకు బడి, క్షేత్ర స్థాయి సిబ్బంది అండదండలతో భూఆక్రమణలకు పాల్పడుతున్నారు. పేదోడు సెంటు భూమి ఆక్రమిస్తే రెవెన్యూ అధికారులు నానా యాగీ చేస్తారు. ఇలాంటివి వారికి కనిపించావా.. అంటూ పలువురు ప్రశ్నించారు. మొన్న మండలంలోని ఆర్లపడియలో రాత్రికిరాత్రే యంత్రాల సహాయంతో చదును చేసి భూఅక్రమణకు పాల్పడ్డారు. తాజాగా చౌడేపల్లిలోని సీజేఎఫ్ ఎస్, గండిపాళెం జలాశయ ముంపు ప్రాంత భూములు సుమారు 100 ఎకరాలు చదును చేసి మినుము, జామాయిల్ సాగుకు సిద్ధమవుతున్నారు.

● వంద ఎకరాల ఆక్రమణ

మండలంలోని చౌడేపల్లిలో భూములు సారవంతంగా ఉన్నాయి. ఎర్రమట్టి స్వభావం కలిగిన భూములు కావడంతో మెట్ట పైర్లకు సాగుకు అను వైంది. ఇక్కడ ఎకరా భూమి రూ.లక్షల్లో ధర పలుకు తోంది. ఇటీవల సమృద్ధిగా వర్షాలు కురిశాయి. దీంతో కొంతమంది అక్రమార్కులకు సీజేఎఫ్ఎస్, గండి పాళెం జలాశయం ముంపు ప్రాంత భూములపై కన్ను పడింది.



పంటల సాగుకు సిద్ధం చేసిన ప్రభుత్వ భూమి

ఇంకేముంది యంత్రాల సహాయంతో రేయింబవళ్లు సుమారు 100 ఎకరాలను అక్రమించేందుకు సిద్ధమయ్యారు. భూమిలో ఉన్న చెట్లను తొలగించి సిద్ధం చేశారు. ఏకంగా దున్నకాలు చేపట్టారు. కొంత భూమిలో మినుము పంట సాగు చేయగా, మరి కొంత పొలంలో జామాయిల్ సాగుకు సిద్ధమవుతున్నారు. అక్రమించిన భూములను అధి కారులు పట్టించుకపోతే ఏకంగా కంచెలు వేసి దొంగ పట్టాలు సృష్టిస్తున్నారు. అక్రమ ఐదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

చౌడేపల్లిలో భూములు అక్రమించిన వారిపై చర్యలు చేపడతాం. అక్రమణల విషయం తన దృష్టికి రావడంతో ఆర్ఐ, వీఆర్వోలను పరిశీలించాలని ఆదేశించా. వారిచ్చే నివేదిక ప్రకారం పోలీసులకు ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటా.

- సుభద్ర, తహసీల్దారు, ఉదయగిరి



చిత్తలూరు సమీపంలోని రెడ్డిగుంటవాగు వద్ద ప్రమాదానికి గురైన కారు

తాగిన మైకంలో
కారు చోరీ యత్నం

● దారిలో ప్రమాదానికి గురైన కారు

చేజర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిలేరుకు చెందిన శ్రీకాంత్ మద్యం మత్తులో కారు చోరీకి యత్నించి దారిలో ప్రమాదానికి గురై అడ్డంగా దొరికిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో చేజర్ల మండలం గొల్లపల్లికి చెందిన పెదరత్తయ్య కారులో చేజర్ల బస్టాం డుకు వచ్చాడు. అవసరమైన సామానులు తీసుకునేందుకు కారు దిగి వెళ్లాడు. ఇదే సమయంలో ఆదురుపల్లిలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ బైక్‌లో చేజర్లకు వచ్చాడు. కారులో తాళాలు ఉండడం గ్రహించి వెంటనే అందులోకి ఎక్కి అక్కడ నుండి అదురుపల్లి వైపు ఉడాయించాడు. ఈ సంఘటనతో బిత్తర పోయిన పెదరత్తయ్య స్థానికంగా ఉన్న కొంత మందితో కలిసి కారును వెంబడించారు. చిత్తలూరు సమీపంలోని రెడ్డిగుంటవాగు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టరును కారు ఢీకొనడంతో ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. అటుగా వస్తున్న స్థానికులు, వెంబడించిన వారు వాహనంలో ఉన్న వ్యక్తిని బయటకు తీసి దేహశుద్ధి చేసి వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ సంఘటనపై పోలీసులు విచారి స్తున్నారు

పోలేరమ్మ ఆలయంలో చోరీ

విడవలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విడవలూరు పంచాయతీ పరిధిలో గల వడ్డిపాళెం పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు , పోలేరమ్మ గుడి తలుపులను పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి రెండు కాసుల తాళిబొట్టును, హుండీలోని నగదును దోచు కెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాల సరఫరాలో సహకరించుకుందాం

● కృష్ణ డెయిరీ చైర్మన్‌తో 'విజయ' చైర్మన్ భేటీ



కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్, ఎండీతో రంగారెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాల సరఫరా విషయంలో పరస్పరం సహకరించు కుందామని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి విజయవాడలోని కృష్ణమిల్క్ యునియన్‌ను కోరారు. శనివారం ఆయన 'విజయ' ఎండీ కృష్ణమో హన్‌తో కలిసి కృష్ణ మిల్క్ యునియన్ డెయిరీని సందర్శించారు. అనంతరం ఆ డెయిరీ చైర్మన్ టీ ఆంజనేయులు, ఎండీ ఈశ్వర్ బాబుతో సమావేశమ య్యారు. రెండు డెయిరీలు పరస్పరం సహకరిం చుకోవాలని కోరగా 'కృష్ణ' చైర్మన్, ఎండీ సానుకూలంగా స్పందించారని కొండ్రెడ్డి తెలిపారు.

'ఎన్టీఆర్ వైద్యసేవ' సమన్వయకర్తగా డాక్టర్ సుధీర్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా సమన్వయకర్తగా డాక్టర్ సుధీర్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రస్తుతం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్‌గా ఉన్న డాక్టర్ చంద్రశేఖర్ బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లటంతో ఆయన స్థానంలో ప్రభుత్వం డాక్టర్ సుధీర్‌ను నియమించింది. ఆయన బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు జ్ఞాపిక అందిస్తున్న డాక్టర్ సుధీర్‌కుమార్

వినికిడి యంత్రాల పంపిణీకి రేపు వైద్య పరీక్షలు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వినికిడి లోపంతో బాధపడుతున్న పిల్లలకు ఉచితంగా వినికిడి పరికరాలు అమర్చేందుకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచల య్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు జీజీహెచ్‌లోని జిల్లా భవిత కేంద్రంలో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లల కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, దీనదయాళ్ శరవణ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపడుతోందన్నారు. వైద్య పరీక్షల ద్వారా గుర్తించిన పిల్లలకు డిసెంబరులోపు వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తారన్నారు. పూర్తి వివరాలకు బాల భవిత కేంద్రం మేనేజర్ పఠాన్ జమీర్ (ఫోన్ నెంబర్ 93814 68458)ను సంప్రదించాలని కోరారు.

సోమశిలకు 19,342 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమ శిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 19,342 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలి పారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తు తం 63.135 టీఎంసీలు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డీబార్

వెంకటాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో శనివారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 7197 మందికిగానూ 6698 మంది హాజరు కాగా, 499 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు కలిపి మొత్తం ముగ్గురు డీబార్ అయినట్లు ఆయన తెలిపారు.

పథకాల పేరుతో
రూ.లక్షల్లో అవినీతి

● పొదుపు సంఘాల నిర్వహణ అధ్వానం ● లోపించిన అధికారుల పర్యవేక్షణ

మనుబోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పొదుపు సంఘాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. మండలంలోని 19 పంచాయతీల్లో సుమారుగా 890 కుపైగా గ్రూపులు ఉన్నాయి. ఇందులో గ్రూపునకు పదిమంది చొప్పున వేలాదిమంది సభ్యులు ఉన్నారు. 20నుంచి 30సంఘాలను ఒకటిగా చేసి సంఘబంధాలు ఏర్పాటు చేస్తారు. ఇలా మండలంలో 29 సంఘబంధాలు ఉన్నాయి. ఒక్కో సంఘబంధానికి ఒక్కో వీవోఏ ఉన్నారు. ఐదుగురు వీవోఏలను ఒక సీసీ పర్యవేక్షిస్తారు. సీసీలపై ఏపీఎం, ఏసీలు ప్రతినెలా సమీక్షలు చేస్తారు. పొదుపు మహిళల కోసం ప్రభుత్వం ఇంతటి పటిష్ట వ్యవస్థను ఏర్పాటుచేసినా క్షేత్రస్థాయిలో రికార్డుల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. రుణాలు కావాల్సినప్పుడు, ఆడిట్‌లు ఉన్నప్పుడు, అధికా రుల తనిఖీలంటేతప్ప సమావేశాలు, రికార్డులు రాయడం లేదు.

● నిరక్షరాస్యులను ఆసరా చేసుకుని..

గ్రామాల్లో ఉండే పొదుపు గ్రూపులలో ఎక్కువమంది నిరక్షరాస్యులే. దీంతో వీవోఏలదే సంఘాల నిర్వహణ పూర్తి బాధ్యత. సంతకాలు పెట్టడం తప్ప సభ్యులకు ఏమీ తెలియదు. ఇలాంటి వారిని ఆసరాగా తీసుకుని వెలుగులో పనిచేస్తున్న సిబ్బంది, కొంతమంది లీడర్లు పథకాలపేరుతో రుణాలు తీసుకోవడం, చెల్లించిన డబ్బులను బ్యాంకులకు కట్టకుండా వాడేసుకుంటున్నారు. అంతేకాక గ్రూపుల్లోని లీడర్లతో వెలుగు సిబ్బంది కుమ్మక్కై రుణాలు తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. గ్రూపుల నిర్వహణ, సమావేశాలు, రుణాల మంజూరు చేయించి నందుకు వీవోఏలకు ప్రభుత్వం నెల జీతాలు అందిస్తుంది. అయితే రుణాలు ఇచ్చినప్పుడు, రికార్డులు రాసినందుకు సభ్యులనుంచి కమీషన్లు తీసుకుంటున్నారని కొంతమంది మహిళలు పేర్కొన్నారు. ఎక్కువగా స్త్రీనిధి పథకం కింద ఇటు లీడర్లు, అటు వెలుగు సిబ్బంది రుణాల రికవరీ చేయక రూ. లక్షల్లో బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, గతంలో స్త్రీనిధి అధికారులు బయటపెట్టారు.

● స్వాహాచేస్తున్నా పట్టింపేది ?

మేం కట్టిన డబ్బులు తినేస్తున్నారని, బ్యాంకులకు కట్టడం లేదని పొదుపు మహిళలు మొత్తుకుంటున్నా వెలుగు అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతినెలా వాయిదాలను వీవోఏకు చెల్లించి రశీదులు తీసుకుంటు న్నారు. అయితే బ్యాంకు నుంచి నోటీసులు వచ్చేవరకు తాము కట్టినడబ్బును వీవోఏ బ్యాంకుకు చెల్లించలేదన్న సంగతి తెలియరాలేదంటూ వీరంపల్లి మహిళలు ఈనెల 18న పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఇలాంటి సంఘటనలు చాలానే ఉన్నాయి. గతంలో గ్రామాల్లో లీడర్లు డబ్బులు తినేశారని, గ్రామం వదిలివెళ్లారంటూ పోలీసుల వద్ద వారు వాపోయారు. ఇక వెలుగు కార్యాలయంలో అయితే ఎంతోమంది మహిళలు సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో వాపోతున్న వీరంపల్లి పొదుపు మహిళలు (ఫైల్)

న్యూస్ బాక్స్

జేసీ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న జేసీ తదితరులు

వింజమూరు, అక్టోరు 26 (ఆంధ్రజ్యోతి):పంచాయతీలోని బీసీకాలనీ సమీపంలో ఉన్న పీర్లమాన్యం భూములను, కావలి రోడ్డులోని సీహెచ్‌సీ భూములను శనివారం జేసీ కార్తీక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ గతంలో తాము వైద్యశాలకు భూ ములు ఇచ్చామని, ఇంతవరకు తమకు భూములు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తానని వారికి జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు హమీద్, సర్వేయర్ రవి, శిరీష, కంచర్ల రమణయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నర్రవాడ పంచాయతీలోని శ్రీవెంగమాంబ ఎస్టీ కాలనీలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, వీఆర్వో మాల్యాద్రిల సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి హరీష్ రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ చుండి హరిగోపాల్‌రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ రియాజ్, రమీజా, సూర్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల నిర్వహణలో భాగంగా ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివే స్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నరసింహం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పాలూరు, దొండపాడు, సినిగేవారిపాలెం, మదన గోపాలపురం, శ్రీరంగరాజపురం గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించగలరని కోరారు.

మాలకొండ ఆదాయం రూ. 6.25 లక్షలు

వలేటివారిపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహ స్వామికి శనివారం భక్తుల నుండి రూ.6,2 5,1 80 ఆదాయ వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అష్టోత్తరం టిక్కెట్లు, కుంకుమార్చన, వివాహాలు, తల నీలాలు, వాహనపూజలు ప్రత్యేకద ర్శనం, స్థల పురాణం పుస్తకాలు విక్రయం, రూము అద్దెలు, కవర్లు అమ్మకాలు, లడ్డుప్రసాదం, అన్నదానం, విరాళాలు ఉన్నట్లు డీసీ సాగర్‌బాబు పేర్కొన్నారు.

రేపు ప్రజా విజ్ఞప్తుల వేదిక

అనంతసాగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాల యంలో సోమవారం ఉదయం 10 గంట లకు ప్రజావిజ్ఞప్తుల వేదిక నిర్వహించనున్నట్లు కార్యక్రమానికి దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచిప్రకటన విడుదల చేశారు.

పనుల పరిశీలన

ప్రజావేదిక వద్ద జరుగుతున్న పనులను శనివారం ఆత్మకూరు ఆర్డీవో పావని పరిశీలించారు. కార్యక్రమం గురించి ప్రజలకు తెలిసేలా ప్రచారం ముమ్మరంగా చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఉన్నారు.

కావలి మున్సిపాలిటీకి అవార్డు

కావలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆత్మ నిర్భయ నిధి (పీఎం స్వానిధి) పథకం కింద తోపుడు బండ్ల వ్యాపారుల రుణాల మంజూరుకు చేసిన కృషికి కావలి మున్సిపాలిటీ అవార్డుకు ఎంపికైనట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన 15 మున్సిపాల్టీలలో కావలి మున్సిపాల్టీ కూడా అవార్డుకు ఎంపికైందన్నారు. ఈ అవార్డును ఈ నెల 29న విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు అందజేస్తారని పేర్కొన్నారు.

ప్రపంచ తెలుగు సమాఖ్య సన్నాహక సమావేశం

● పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

కందుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభ సన్నాహ సమావేశం శుక్రవారం రాత్రి హైదరాబాదులో నిర్వహించారు. ఈ సమావేశానికి కందుకూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు డాక్టర్ దివి శివరాం, సతీమణి సౌభాగ్య పాల్గొన్నారు. 2025 జనవరి 3,4,5 తేదిల్లో 2000మంది డెలిగేట్స్‌తో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభ నిర్వహించ బోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రాళ్లపాడు స్పిల్‌వేలో మరమ్మతులు

● 5వ నంబరు రేడియల్ గేటు రోప్ కట్అయిన వైనం

● కొత్త రోప్ కోసం అధికారుల ప్రతిపాదనలు

లింగసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులోని కొత్త స్పిల్‌వేకు చెందిన 5వ నంబరు రేడియల్ గేటు మరమ్మతులకు గురైంది. ఈ రేడియల్ గేటును ఆపరేట్ చేసే రోప్ వంక తిరిగి కొన్ని పీసులు కట్ అయ్యింది. ఈ సమస్యతో గేటు సుమారు ఏడెనిమిది నెలల నుంచి పని చేయడం లేదు. అయితే భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి వరద నీరు ఉధృతంగా వస్తే అధికారులు కొత్త స్పిల్‌వేలోని 5 గేట్ల ద్వారా 1 లక్షా 70 వేల కూసెక్కుల వరద నీరు మన్నేరులోకి విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ గేటు పని చేయనందు వలన ప్రస్తుతం మిగిలిన నాలుగు గేట్ల ద్వారా మాత్రమే వరద నీరు మన్నేరుకు విడుదల చేసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం 1 లక్షా 50 వేల క్యూసెక్కులకు మించి వరద నీరు వస్తే పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు ఏఈ జి.చంద్రమౌళిని వివరణ కోరగా కొత్త రోప్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇది ఇలా వుండగా పాత స్పిల్‌వేలోని 10 క్రస్ట్ గేట్లు, 2 పూడు గేట్లు అధికారులు చాలా ఏళ్లుగా ఆపరేట్ చేయడం లేదు. ఈ గేట్ల కౌంటర్ వెయిట్లు చాలా పాతవి కావడంతో వీటిని ఆపరేట్ చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి, ఈ గేట్ల కౌంటర్ వెయిట్లు కొత్తవి మరియు కొత్త రేడియల్ గేటు రోప్ త్వరగా ఏర్పాటు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలోని 5వ నంబరు రేడియల్ గేటు

అట్టహాసంగా టీడీపీ సభ్యత్వ నమోదు

కావలిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

కలిగిరి, వింజమూరులో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కందుకూరులో ఇంటూరి



కలిగిరి: సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న కాకర్ల సురేష్

కావలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. ముందుగా బీద రవిచంద్ర, ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిలు చెరో రూ. లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. వారితో పాటు కావలి నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, తిరువీధి ప్రసాద్, పద్మావతి శ్రీదేవి, కోటా రమేష్ ఈ సభ్యత్వం తీసుకున్నారు.

● **రుణం తీర్చుకునేందుకు..**

కావలి నియోజకవర్గంలో టీడీపీకి అత్యధిక మెజార్టీ ఇచ్చిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు బీద రవిచంద్ర సహకారంతో మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేసేందుకు ముందుకు పోతున్నట్లు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో లక్షకు పైగా సభ్యత్వాలు చేసి అగ్రగామిగా నిలుద్దామని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

● కలిగిరి: పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని అభిమానించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. సభ్యత్వ నమోదుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ చీమల తాతయ్య, సర్పంచులు వెంగపనాయుడు, వరప్రసాద్, రేష్మ, లెక్కల రాంబాబు, మాదాల శ్రీ నివాస్, సతీష్, కొండలరావు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ సభ్యత్వాల నమోదును మండల టీడీపీ కన్వీనర్ సీహెచ్ బయ్యన్న ప్రారంభించారు. అనంతరం ప లువురు సభ్యత్వాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రా జా, నరసింహులు, సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, నవాజ్, శివకృష్ణ పాల్గొన్నారు.

● **సభ్యత్వం నమోదు చేసుకోండి**

టీడీపీ సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబుయాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.100లు చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు.

● వరికుంటపాడు: స్థానిక టీడీపీ కార్యాల యంలో శనివారం సభ్యత్వ నమోదును మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

● సీతారామపురం: సభ్యత్వ నమోదులో ఉదయగిరి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం ఉండాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ కోరారు. శనివారం మండల పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కప్పా ప్రభాకర్ రాజు, సోమనబోయిన రాజశేఖర్, తోట మాల్యాద్రి, తోట మనోజ్, మహాలక్ష్మయ్య, రఘురామయ్య, ప్రసాదు పాల్గొన్నారు.

● వింజమూరు: టీడీపీసభ్యత్వ నమోదులో భాగంగా వింజమూరు, కలిగిరి మండలాలలో శనివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ముందుగా వింజమూరులోని వెలమబజార్, కలిగిరి మండలం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాల్గొని స్థానిక నాయకులు, కార్యకర్తలను సభ్యత్వం చేర్పించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు బృహత్తర కార్యక్రమమని అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, గణపం సుదర్శన్‌రెడ్డి, గూడా నర్సారెడ్డి, వేమలపాటి మాల్యాద్రి, కొండపల్లి వెంకటేశ్వర్లు, దంతులూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● కందుకూరు: పట్టణంలో నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమంను ప్రారంభించారు. పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు రూ.లక్షతో పార్టీ శాశ్వత సభ్యత్వం ఆన్‌లైన్ నమోదు చేసుకోగా సంబంధిత కార్డును ఎమ్మెల్యే నాగేశ్వ రరావు అతనికి అందజేశారు. అలాగే కొండము దుసుపాలెం పొడపాటి మల్లికార్జున్, కాకుమని బసవేశ్వరరావులు ఈ శాశ్వత సభ్యత్వం నమోదు తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, కంద్రా మాల్యాద్రి, దదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, షేక్ మున్నా, పొడవాటి మహేష్ పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: పోకూరులో శనివారం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. నాయకులు ఇంటింటికి వెళ్లి సభ్యత నమోదు ఆవశ్యకతను వివరించారు. ప్రతిఒక్కరూ సభ్యత్వం తీసుకొని పార్టీలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఘట్టమనేని లక్ష్మీనరసింహం, గురిజాల బెంజిమెన్, సోమినేని తిరుమలరావు, వడ్లమూడి లక్ష్మీనరసింహం, ఘట్టమనేని లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.



కందుకూరు: సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి



ఉదయగిరి రూరల్: సభ్యత్వాలు తీసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మెనూలో పండ్లు తప్పనిసరి

● **నలంద హైస్కూల్‌లో ఫ్రూట్స్ స్టాల్ ఏర్పాటు**

ఆత్మకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ మనం తినే ఆహారంలో పండ్లు తీసుకుంటే శరీరానికి అవసర మైన పోషకాలు అందుతాయని నలంద హైస్కూల్ కర స్పాండెంట్ ఈగ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫ్రూట్స్ డే స్టాల్స్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పండ్లు వాటిలో ఉంటే విటమిన్లు వివరిస్తూ డెమో రూపంలో విశదీకరించారు. ఈ సందర్భంగా ఈగ భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. పండ్లు ప్రతిరోజూ తినడం వలన దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయన్నారు. లేనివారికి వ్యాధులు రాకుండా దరిచేరవన్నారు. పండ్లతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులు తెలుసుకొని వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారనే లక్ష్యంతో ఈ ఫ్రూట్స్ డే నిర్వహించామన్నారు. నలంద స్కూల్ డైరక్టర్ రత్నమ్మ, ప్రధానో పాధ్యాయులు, బాబు, సైన్స్ టీచర్ రవికుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫ్రూట్స్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఈగ భాస్కర్‌రెడ్డి

రీ సర్వే తప్పులపై చర్యలు తీసుకుంటాం

లింగసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో జరిగిన పొరపాట్లను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శనివారం తూనుగుంటలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పా ల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు 57అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ నాగ రాజు, సర్వేయర్లు ఎం.నాగరాజు కె.వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.



తూనుగుంటలో అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్

రీసర్వే గ్రామసభకు అర్జీల వెల్లువ

జలదంకి, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): తిమ్మసముద్రంలో శనివారం రెవెన్యూ అధికారులు చేపట్టిన రీసర్వేపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వంశీక్రిష్ణ హాజరై ప్రజల నుండి వినతులు స్వీకరించారు. రీసర్వేలో భూవిస్తీర్ణంలో, భూ యజమాని పేరు తప్పులు దొర్లాయని వందలసంఖ్యలో అర్జీలు వచ్చాయి. 15రోజుల వ్యవధిలో అన్ని తప్పులు సరిచేసి పక్కాగా రికార్డులలో చేరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు, డిటి జూలీభాయ్, వీఆర్వో గిరి, టీడీపీ నేత కంచర్ల వినోద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు షాపు నిర్వహించాలి

బిట్రగుంట, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం షాపు ఏర్పాటు చేస్తే తగదని ఇబ్రహీంపేట, తిప్ప, కోమూరు పల్లి గిరిజన కాలనీకి చెందిన మహిళలు అన్నారు. శనివారం ఇబ్రహీం పేట శివారు ప్రాంతంలో నూత నంగా ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్ద నిరసన చేసి దుకా ణం మూయించారు. శివాలయం, ప్రైవేటు ఐటీఐ ఉన్నచోట మద్యం దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అనం తరం తహసీల్దారు కార్యాలయంలో వీఎస్‌ఆర్ పేట వీఆర్వో రామోహన్‌కు వినతి పత్రం అంద జేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు ఎల్.సుధీర్ బాబు, ఎస్.భాస్కర్, అహ్మద్‌బాషా, ఆదిశేషయ్య, క్రాంతి, మనోహర్, నరసింహారావు, జయరామ్, యు.రవి ఉన్నారు. వివాద విషయం తెలుసుకున్న సెబ్ ఎస్సై దేవిక, సిబ్బంది సంఘ టన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిం చారు. ఈ విషయమై కావలి సెబ్ సీఐ శ్రీని వాసులు మాట్లాడారు. షాపులకు ప్రస్తుతం తాత్కాలిక లైసెన్సులతో నిర్వహి స్తున్నట్లు చెప్పారు.



వీఆర్వోకు వినతిపత్రం అందచేస్తున్న మహిళలు

ముమ్మరంగా పారిశుధ్య పనులు



బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

జలదంకి, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణక్రాకలో శనివారం సర్పంచ్ ఇండ్ల సుధాకర్, కార్యదర్శి నీరజలు పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీలో వీధుల వెంబడి నిలిచిన వర్షపునీరు నిలిపై పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలి

కావలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒట్టూరు మోడల్‌స్కూల్‌కు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లి తండ్రులు శనివారం కావలి ఆర్టీసీ డిపో ట్రాఫిక్ కంట్రోలర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కావలి -తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులతో 15 రోజులుగా స్కూల్‌కు వెళ్లే బస్సు తిగటం లేదన్నారు. కార్యక్రమంలో కరువది భాస్కర్, ఎస్‌కే ఖాదర్‌బాష, ప్రవీణ్, రవి, నరసింహారావు, నాయబ్, చంద్ర, ఇజహార్, శ్రీను పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కావలి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉప్పు అన్నపూర్ణ (40) నెల్లూరులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ నెల 21వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడగా భర్త, సోదరుడు ఆమెను పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారటంతో ఈ నెల 25న మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. మృతురాలికి భర్త వెంకటేశ్వర్లు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ బాష తెలిపారు.

అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కందుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై కలెక్టర్ ఆనంద్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. కొన్ని పంచాయతీలలో వైసీపీ సర్పంచులను అడ్డం పెట్టుకొని శానిటేషన్ చేయకుండా, వీధిలైట్లు, రోడ్లు వేయకుండా అ అధికార పార్టీ నాయకులునిధులు దుర్వినియోగం చేశారన్నారు. వైసీపీ పార్టీ నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన కార్యాలయ నిర్మాణానికి ఆమోదం

కలిగిరి(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 26: ఎంపీడీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్న దృష్ట్యా నూతన ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి శనివారం జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశంలో ఏకగ్రీవ ఆమోదం చేసినట్లు ఎంపీపీ మెట్టుకూరు శిరీష తెలిపారు. వర్షాకాలంలో ప్రతి గ్రామంలో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదే శించారు. విత్తనాలను పూర్తిస్థాయిలో రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఏఓ సురేష్‌బాబుకు సూచించారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి మినరల్ వాటర్‌ప్లాంట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు వేయించాలన్నారు. ఎంపీడీఓ ప్రత్యూష, మండల విస్తరణాధికారి వెలుగోటి మధు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌లో సమస్యలు

కొండాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతలదీవి, గరిమెనపెంట, గుడవల్లూరు సచివాలయాల్లోని ఆధార్ సెంటర్లు పని చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర విద్యాశాఖ దేశ వ్యాప్తంగా ఒకే ఐడీ నెంబరును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. అలాంటి నెంబరును రూపొందించేటపుడు ప్రతి విద్యార్థి వారి ఆధార్ నెంబ రును అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు వారి పుట్టిన తేదీ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఆధార్ అప్‌డేట్ తీవ్ర సమస్యగా నెలకొంది. అలాంటి వారికి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు ధృవీకరించాల్సి ఉంది.

వచ్చామా..వెళ్లామా!

మొక్కుబడిగా మండల సమావేశం

వరికుంటపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సమావేశం శనివారం మొక్కుబడిగా సాగింది. అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు సైతం వచ్చామా.. వెళ్లమా ! అనే రీతిలో పట్టుమని పది నిమిషాలు కూడా సభలో ఉండకుండానే వెళ్లిపోయారు.ఉదయం 10.30 గంటలకు నిర్వహించాల్సిన సమావేశం కోరం లేకపోవడంతో ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. అయినా ఫలితం లేకపోవడంతో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు చొరవ తీసుకొని సమీపంలోని జడదేవి ఎంపీటీసీ కోసం ఆమె నివాసానికి కారు పంపి సమావేశానికి తీసుకొచ్చారు. అంతవరకు వేదికపై ఎంపీపీ జీ వెంకటలక్ష్మి ఎదురుచూడాల్సి వచ్చింది. 12.15 గంటలకు వేదికపైకి జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఎంపీడీవో, వైస్ ఎంపీపీ మధు రావడంతో సమావేశాన్ని ప్రారంభించారు. అయినా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు గైర్హాజరు కావడంతో అజెండాలోని అంశాలను గాలికొదిలేశారు. కేవలం 30 నిమిషాల్లోనే సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ సమావేశానికి అధికారులే సమావేశాలకు డుమ్మా కొట్టడం ఎంతవరకు సమంజసమని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశంలోనూ ఇలాంటి వైఖరే అవలంభిస్తున్నారని మండిపడ్డారు. దీంతో ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి హాజరు కాలేకపోతున్నారన్నారు. కాగా తొమ్మిది మంది ఎంపీటీసీలకుగాను కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. 24 మంది సర్పంచులకుగాను ముగ్గురే హాజరయ్యారు.

చిన్నారులు, గర్భిణుల సంక్షేమమే ధ్యేయం

● సౌజన్య, ఐసీడీఎస్ సీడీపీవో



కావలి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, గర్భవతులు, బాలింతల సంక్షేమమే తమ ధ్యేయమని కావలి ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య తెలిపారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ద్వారా నిధులు కేటాయించి పోషక ఆహారం అందిస్తున్నాం.

? పిల్లలకు ఎలాంటి పోషకాహారం అందిస్తున్నారు.

! పాలు, గుడ్డు, చిక్కీలు, బాలమృతం, ఆకు కూరలతో భోజనంతో పాటు ఇతర పోషక ఆహారం అందిస్తున్నాం.

? గర్భిణులు, బాలింతలకు ఏ పోషకాలు ఇస్తారు.

! గర్భిణిలు, బాలింతలకు నెలకు 3కేజీల బియ్యం, కెజి పప్పు, అర కిలో నూనె, కెజి బాలసంజీవని, 2కేజీల రాగి పిండి, కేజి అటుకులు, పావు కిలో కర్జూరం, పావు కిలో బెల్లం, పావు కిలో చిక్కీలు, 5 లీటర్ల పాలు, 25 కోడి గుడ్లు ఇళ్లకు ఇస్తున్నాం.

? ప్రీ స్కూల్ నూతన టైం టేబుల్ ఎలా ఉంది.

! నూతన ప్రీ స్కూల్ టైటేబుల్ సతృలితాన్ని ఇస్తుంది. విద్యతో పాటు విలువలు, ఆట,పాటలు, మంచి ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణ, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వ హిస్తాం.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

ఉలవపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాల యానికి రావలసిన సెస్ తప్పనిసరిగా వసూలు చేయాలని, ధరావత్తు సభ్యులను ఎక్కువ మందిని చేర్చాలని, నోటీస్ బోర్డు ఏర్పాటు చేసి గ్రంథాలయ పూర్తి సమాచారాన్ని అందులో ఉంచాలని సూచించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి

ఉలవపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహన్ శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ చార్జీల పెంపుతో పెను భారం పడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలన్నారు.

దళితులందరూ ఐకమత్యంగా ఉండాలి


అల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై దళితులందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు తెలిపారు. శనివారం ఇస్కపల్లిలో ఎస్సీ కాలనీల్లో ఆయన మాలల మహాగర్జనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజకీయ లబ్దికోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలను విడగొట్టేందుకు కక్ష కట్టారని ఆరోపించారు. నవంబరు 4న అల్లూరులో జరిగే మాలల మహా గర్జన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంటేపల్లి సింహాద్రి, పొంగులూరి సుధాకర్, దానం మాల్యాద్రి, గంగపట్నం సతీష్, కమలాకర్, మహేష్ పాల్గొన్నారు.

కూలిన ఘాట్‌రోడ్డు రక్షణ గోడ

వలేటివారిపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డులో మలుపుల వద్ద నిర్మించిన రక్షణ గోడ కూలిపోయింది. ములపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుండా రక్షణ గోడలు నిర్మించారు. ఈ రక్షణ గోడలు పదిరోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు పగుళ్లిచ్చి కూలిపోయింది. ప్రతి శనివారం వాహనాల్లో వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దర్శనం అనంతరం కొండ పైనుండి ఘాట్‌రోడ్డులో కిందకు వచ్చే సమయాలలో వాహనాలు అదుపుతప్పితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భక్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కూలిన రక్షణ గోడలను తిరిగి నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా పెంచలకోన లక్ష్మీనరసింహుడి కల్యాణం

రాపూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన నిత్యకళ్యాణ మండపంలో శనివారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణంను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 4గంటల నుంచి అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్లకు ఊంజల సేవ చేపట్టారు. వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్త పీర్ల సోమయ్యయాదవ్, దేవస్థానం, సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో స్వామివారు

గూడు గోడు వినేదెవరు ?

● అసంపూర్తిగా జగనన్న కాలనీల్లోని ఇళ్లు ● అవస్థ పడుతున్న ప్రజలు

పొదలకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రూ.కోట్లను జగనన్న కాలనీల్లోని ఇళ్లకు ఖర్చు చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.లక్షల్లో ఆస్తి ఇస్తున్నట్లు నాటి ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకున్నారు. ఇంత చేసినా ఐదు శాతం ఇళ్లలో కూడా కూడా నివాసం ఉండని పరిస్థితి నెలకొంది. తూతూమంత్రంగా నిర్మాణం పూర్తి చేసిన కాలనీల్లో వర్షం వస్తే చెరువులను తలపిస్తున్నాయి. పూర్తి చేసిన ఇళ్లు లబ్ధిదారులకు పనికొచ్చేలా లేవు. పునాదుల్లో ఉన్న ఇనుక చువ్వలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. కొన్ని మూడో ఆప్షన్ కింద కట్టిన ఇళ్లు కాలితో తంతేచాలు కూలిపోతున్నాయి.

● మండలం పరిస్థితి ఇదీ..

పొదలకూరు మండలానికి 5101 పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. పొదలకూరు పరిధిలోని చిట్టేపల్లి తిప్ప వద్ద 1100 మందికి ఇళ్ల పట్టాలు అందించగా, అందులో 400 మందికి కాంట్రాక్టర్ ద్వారా ఇంటి నిర్మాణం చేపట్టారు. మౌలిక వసతులు లేకుండానే చేపట్టిన ఇళ్ల నిర్మాణం పనులు నాసిరకంగా జరిగాయని, సక్రమంగా క్యూరింగ్ జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. జగనన్న లేఅవుట్ల్లో గృహ నిర్మాణాలకు కేవలం రూ.1.8 లక్షలు ఇస్తుండడంతో ఆ మొత్తంతో నిర్మించుకోలేమని చాలామంది లబ్ధిదారులు చేతులెత్తేశారు. దీంతో అప్పట్లో అధికార పార్టీకి చెందిన కొంత మంది వ్యక్తులు ఇళ్లు నిర్మిస్తామనంటూ కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. బ్ధిదారులు ఇందుకు సరే అన్నారు. సిమెంటు బ్రిక్స్‌తో రెండు పక్కల సిమెంటుతో పూత పనులు, కిటికీలు, కింద దళం లేకుండా ప్రస్తుతం నాణ్యత లేని నిర్మాణాలు చూసి పలువురు వాపోతున్నారు. కాలనీల్లో కనీసం విద్యుత్, తాగునీరు ఏర్పాటు చేయలేదు. యూనిట్ ధర రూ.1.8లక్షలు, డ్వాక్రా రుణం రూ.35వేలతో కట్టిన ఇళ్లు ఏ మాత్రం నాణ్యత లేకపోగా ప్లాస్టింగ్ కూడా చేయడం లేదు. ఇంటిలోపల అరలు, వంట గది బల్ల, స్నానాల గది, మరుగుదొడ్డి నిర్మాణం చేయకుండా వదిలేశారు. కనీస వసతులు లేనందున లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు.



అసంపూర్తిగా నిర్మించిన జగనన్న కాలనీలోని ఇళ్లు

సభ్యత్వ నమోదులో ప్రథమస్థానంలో నిలపాలి



నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు, నాయకులు కోవూరు నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. శనివారం బుచ్చిలోని ఓ ఫంక్షన్ హాల్లో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కష్టాల్లో వున్న కార్యకర్తలను ఆదుకునేందుకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన ఘనత లోకేష్‌బాబుదేన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు కృష్ణచైతన్య, శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఎంవీ.శేషయ్య, హరికృష్ణ, మల్లారెడ్డి, వీరేంద్ర చౌదరి, పీఎల్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కుమారుడు అర్జున్‌రెడ్డి సభ్యత్వాలను స్వీకరించారు.

● సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య బాధితులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం తన నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులు అందచేశారు. కోవూరుకు చెందిన నిక్కుదల నాగేశ్వరరావుకు రూ.8లక్షలు, ఇందుకూరుపేటకు చెందిన పనబాక శ్రీరామ్‌కు రూ.4లక్షలు, బుచ్చికి చెందిన తిరుపతి వెంకటేశ్వర్లుకు రూ. 61,572, కొడవలూరు మండలవాసి పండ్ల ఆదిశేషయ్యకు రూ.66,713, ఇందుకూరుపేటకు చెందిన రాజేశ్వరమ్మకు రూ.28,800, కోవూరు వాసి షేక్ ఖుర్షీద్‌కు రూ.23,920లకు చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. అనా రోగ్య బాధితులను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు.

● టీడీపీ కార్యకర్తకు రూ.5లక్షలు..

కోవూరుకు చెందిన టీడీపీ కార్యకర్త నిక్కుదల నాగేశ్వరావుకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు శనివారం అంద చేశారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన నాగేశ్వరరావు చికిత్సకు రూ.25లక్షలు అవసరమవుతుందని, తమను ఆదుకోవాలని నాగేశ్వరరావు కుటుంబం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఆశ్రయించటంతో వారు ఆర్థిక సహాయం చేశారు.

ప్రజలు సహకరిస్తే స్వచ్ఛ నెల్లూరు సాధ్యం : కమిషనర్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలంతా సహకరిస్తే స్వచ్ఛ నెల్లూరును సాధ్యం చేసుకోవచ్చని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అన్నారు. శనివారం 45వ డివిజన్ వేదం వారి అగ్రహారం, కపాడిపాళెం, సంతపేట ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. రోడ్లు, నివాసాల వద్ద డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు పరిశీలించారు. ప్రజలు ఇంట్లోని వ్యర్థాలను రోడ్లు, కాలువల్లో వెయ్యకుండా ఇంటి ముందుకు వచ్చే కార్పొరేషన్ చెత్త వాహనాలకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా కాలువల్లో పూడికతీత పనులు జరుగుతాయని చెప్పారు. ఖాళీ స్థలాల్లో కూడా పిచ్చిమొక్కలను తొలిగిస్తున్నామన్నారు.

● విశ్వకర్మ'పై అవగాహన కల్పించాలి

విశ్వకర్మ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్పొరేషన్ ఏడీసీ నందన్, టీపీఆర్వో డబ్బుగుంట బాలకృష్ణ సిబ్బందికి సూచించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ భవనంలో శనివారం సిబ్బందితో సమావేశమయ్యారు. విశ్వకర్మ పథకానికి ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

మంటల్లో తగలబడిన గుడి బోర్డు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని చిన్నబజారు రామమందిరం బోర్డు శుక్రవారం అర్ధ రాత్రి తగలబడింది. శనివా రం ఉదయం బీజేపీ నాయ కుడు మిడతల రమేష్, స్థానిక ప్రముఖులు ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ అగ్ని ప్రమాదంపై విచారణ జరిపించాలని అధికారులను డిమాండ్ చేశారు.



రామాలయం వద్ద అగ్ని ప్రమాదంలో మంటలు

కనుల పండువగా శయ్యాధివాసం : నేడు విగ్రహ ప్రతిష్ఠ



సౌభాగ్య సరస్వతీ ఆలయంలో హోమాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పప్పులవీధి సౌభాగ్య సరస్వతీదేవీ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో శనివారం రాత్రి శయ్యాధివాసం నయనానందకరంగా జరిగింది. భక్తులు పంచదార సుగంధ ద్రవ్యాలతో కాచిన పాలు, పండ్లు, పూలు, చాక్లెట్లు, బిస్కెట్లు, స్వీట్లు సమర్పించారు. సాయంత్రం యాగశాలలో విశేష హోమాలు జరిగాయి. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు మాచ వోలు రమేష్‌శర్మ, మేనేజర్ మాచవోలు అనురాధ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జోరుగా రోడ్డు, డ్రైనేజీ పనులు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 31వ డివిజన్ లాయర్స్ కాలనీలో రోడ్డు, డ్రైనేజీ పనులు జోరుగా సాగుతున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, గిరిధర్‌రెడ్డి సహకారంతో ఈ పనులు చేపట్టారు. దీంతో స్థానికులకు రోడ్లు, డ్రైనేజీ సమస్య తీరుతుందని ఆ డివిజన్ కార్పొరేటర్ బత్తల మంజులకృష్ణ, ఇన్‌చార్జి బత్తల కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూకటి హరిబాబు, ఓబుల్‌రాజు పాల్గొన్నారు.

టపాసుల గోదాముల్లో ఆర్డీవో తనిఖీ



టపాసుల గోదాముల్లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో అనూష

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు టపాసుల గోదాములను శనివారం నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష తనిఖీ చేశారు. దీపావళి పండుగ నేపథ్యంలో గోదాముల్లో నిల్వ ఉంచిన బాణసంచాను, రికార్డులను పరిశీ లించారు. లైసెన్సులు కలిగి, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా...లేదా అని ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి తప్పనిసరిగా పన్నులు చెల్లించాలని కోరారు. టపాసుల గోదాముల యజమానులు భద్రతా ప్రమాణాలు పాటిం చాలని ఆదేశించారు.

సీసీ రోడ్డు నిర్మాణం పరిశీలన



సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదెమ్మ సత్రంలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను శనివారం పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ అశోక్, డ్వామా పీడీ బీ గంగాభవాని పరిశీలించారు. పనులలో నాణ్యత లోపించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులురెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు కుదురు రాధాకృష్ణారెడ్డి, కూకటి వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు 30, 31 డివిజన్లకు నీటి సరఫరా నిలిపివేత

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 30వ డివిజన్ సత్యనారాయణపురంలో వాటర్ ట్యాంక్ పంప్‌లు, పైపులు మరమ్మతులకు గురయ్యాయని, అందువల్ల 30, 31 డివిజన్లలో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డివిజన్ ఇంజనీరు ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 30వ డివిజన్‌లోని ఒండ్లూరు కాలనీ, రవిచంద్ర గిరిజన కాలనీ, వైఎస్సార్ నగర్, మిథులానగర్, తిరుమలనగర్, కొత్తూరు, చంద్రబాబునగర్ ప్రాంతాలు, 31వ డివిజన్‌లో అక్కచెరువుపాడు, కిచ్చరగుంట, శ్రీలంక కాలనీ, రామకోటయ్య నగర్, 25వ డివిజన్‌లోని బుజబుజనెల్లూరు తదితర ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రజలు ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

నేడు మనుచరిత్రపై ప్రవచనం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మనుచరిత్ర - అల్లసాని పెద్దన అనే అంశంపై ప్రవచనం జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం, వై శేషగిరీశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు వర్ధమాన సమాజం (టౌనుహాలు)లో జరిగే ఈ కార్యక్రమానికి వక్తగా ఆచార్య టీ మాలకొండయ్య, విశిష్ట అతిథిగా ఎంఆర్ ప్రసాద్ హాజరవు తారని తెలిపారు. సాహిత్య అభిమానులు తరలిరావాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

వీడని వర్షపు నీరు



వానలు వెలసి రెండువారాలైనా కోవూరులోని కోనమ్మతోటను వర్షపునీరు వీడటంలేదు. ఇక్కడ కొన్నేళ్లుగా వర్షాకాలమంతా నీరు నిలిచే ఉంటుంది. దీంతో నీటిలో దోమలార్వా ఉత్పత్తి చెంది డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాపిస్తున్నాయి. వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎప్పటి నుంచో అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. అయినా వారు పట్టించుకోవడం లేదు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లలో వ్యవస్థలన్నీ నాశనం



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సోమిరెడ్డి

మనుబోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీరంపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇలాంటి పశువైద్యశిబిరాలు నిర్వహించారా అని ప్రశ్నించారు. పాడి రైతులను తమ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. త్వరలోనే పొదలకూరు మండలంలో డయాలసిస్ యూనిట్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ నెల్లూరు డివిజన్ డీడీ ఎం. నాగమణి, డీఎల్‌డీఏ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, మస్తాన్‌నాయుడు,అల్లారెడ్డి రవీంద్రరెడ్డి, యానాదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● మీరైనా న్యాయం చేయండయ్యా...

తాము రుణాలు తీసుకుని చెల్లించినా వీవోఏ భారతి బ్యాంకులకు కట్టకుండా స్వాహా చేశారని,ఈ విషయమై అధికారులకు చెప్పినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, మీరైనా మామొర ఆలకించాలని వీరంపల్లిలో ఎమ్మెల్యే సోమిరెడ్డికి పొదుపు మహిళలు విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులు, పోలీసులపై సీరియస్ అయ్యారు. సాయంత్రంలోగా విచారించి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

●టీడీపీ సభ్యత్వంతో గౌరవం, బీమా

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త, అభిమాని తప్ప కుండా టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వేదాయపాళెంలోని ఆయన కార్యాలయంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రూ.100 చెల్లిస్తే సాధారణ సభ్యత్వంతోపాటు గౌరవం, బీమా సౌకర్యం కూడా లభిస్తుందని తెలిపారు. రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం కూడా పొందవచ్చని చెప్పారు. నవంబరు 21న సాగునీటి సంఘాల ఎన్నికలు జరగబోతున్నాయని, ఆ తరువాత డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టుల కమిటీల ఎన్నికలు జరుగుతాయన్నారు. మరో ఆరేడు నెలల్లో ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు రానున్నాయన్నారు. ఓట్ల కోసం నా తల్లి, నా అక్క, చెల్లి, అన్న జగన్ ఇప్పుడు ఆస్తుల కోసం సొంత చెల్లి, తల్లికే ద్రోహం చేస్తున్నాడని విమర్శించారు.

ఉచిత బస్సు ఏమైంది ? : కాంగ్రెస్



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు హామీ ఏమైందని కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు షేక్ ఫయాజ్ ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు నగరంలోని ఆర్టీసీ ప్రాంగణంలో శనివారం పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఫయాజ్ మాట్లాడుతూ గత ప్రభు త్వరలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీని లాభాలు బాటలో నడపాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రె స్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు అల్లాఉద్దీన్, మోహన్, ఫజులుద్దీ న్, షేక్ ఇర్ఫాన్, మల్లికార్జున రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

సర్పంచులు సమావేశానికి తప్పక హాజరవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగమణి

ముత్తుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, మండల స్థాయిలో జరిగే ప్ర తి సమావేశానికి ఎంపీటీసీ లు, సర్పంచులు తప్పనిస రిగా హాజరుకావాలని ఎంపీ పీ గంగవరం సుగుణ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సమావేశం జరిగింది. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అ ధికారులు తమ తమ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ సభ్యులు బందెల వెంకటసు బ్బయ్య, వైస్ ఎంపీపీలు చిన్నపరెడ్డి, విజ యలక్ష్మి, ఎంపీడీవో నాగమణి, సర్పంచులు అల పాక శ్రీనివాసులు, పల్లికొండ ప్రతాప్, ఎంపీటీ సీలు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు



ఆధార్ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో

తోటపల్లిగూడూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని వరిగొండ-1 సచివాలయంలో శనివారం జరిగిన ఆధార్ క్యాంపును ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రం ఉంటే కానీ ఆధార్ నమోదు వీలుకానందున లేట్ రిజిస్ట్రేషన్ కింద ఆర్డీవో నుంచి ప్రొసీడింగ్స్ తీసుకుని బర్త్ సర్టిఫికెట్ ఇప్పించి వారికి స్పెషల్ క్యాంప్ పెట్టి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రవళిక, సచివాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపులు తొలగించాలి



నిరసన ప్రదర్శనలో సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర నియోజ కవర్గంలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని సీపీఎం నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు అభ్యంతరం తెలిపిన చోట మద్యం షాపులు పెట్టరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీ పేరుతో మద్యాన్ని ఏరులై పారిస్తోందని విమర్శించారు. సీపీఎం నగర కార్యవర్గ సభ్యురాలు షేక్ మస్తాన్‌బీ మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువ శాతం మద్యం మత్తులోనే జరిగాయని గణాంకాలు చెబుతున్నాయన్నారు. అటువంటి మద్యాన్ని ఇళ్ల మధ్యకు తీసుకురావడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, సూర్యనా రాయణ, కాయల శ్రీనివాసులు, బీపీ నరసింహ, చంద్రారెడ్డి, సుబ్బయ్య, మూలం ప్రసాద్ పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా హోంకు నిత్యావసరాల వితరణ

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విశ్వసాయి ఎస్ఆర్‌కే పాఠశాల విద్యార్థులు, సిబ్బంది బీవీనగర్‌లోని మదర్ థెరిస్సా చారిటీ హోంకు శనివారం నిత్యావసరాలను వితరణ ్ఛ. ఆ విద్యా సంస్థ చైర్మన్ ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో భాగంగా అందరి సహకారంతో రూ.2లక్షల విలువైన బి య్యం, పప్పుధాన్యాలు, చింతపండు, బెల్లం, దు స్తులు, తినుబండారాలను అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ జీ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఎస్ రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల గుంతలో పడి వ్యక్తి మృతి

ఇందుకూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజుతోపు గ్రామానికి చెందిన తాళ్లూరు చెంచయ్య (52) శనివారం ఎండు కొబ్బరికాయలు ఏరుకోవడానికి వచ్చి చేపల గుంతల్లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం హాస్పిటల్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చెంచయ్యకు ఫిట్స్ ఉన్న కారణంగా నీళ్లలో మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.



చెంచయ్య మృతదేహం

న్యూస్ బాక్స్

పంట కాలువల్లో పూడికతీత

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు26:(ఆంధ్రజ్యోతి): కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో చెల్లాయపాళెం డ్రైన్‌లో పూడిక తీస్తున్నారు. శనివారం కోవూరు కాలువ వద్ద నుంచి సాల్మానుపుం మీదుగా పంచేడు వద్ద సదరన్ చానల్ వరకు పూడికతీత పనులు చేపట్టామని ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి అనిష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల వవ్వేరు పరిధిలో సుమారు 11 కిలోమీటర్లు మేర రెండు కాలువల్లో పూడికతత పనులు పూర్తిచేశారు.. శనివారం కాళయకాగొల్లు రోడ్డు సమీపంలోని కాలువల్లో కూడా పూడికతీత చేపట్టారు. దామరమడుగు వద్ద మరో యంత్రంతో పనులు చేపట్టారు.

గోతులు పూడ్చండి !

పొదలకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విరువూరు రీచ్ ఒడ్డున ఉన్న హిందూ, ముస్లిం శ్మశానాలకు వెళ్లకుండా శనివారం గోతులు తీశారని గ్రామస్థులు తెలిపారు. విరువూరు రీచ్‌ను నిర్వహించే వారే ఈ పని చేసి ఉంటారని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్విన గోతులు పూడ్చాలని వారు కోరుతున్నారు.

వీఎస్‌యూలో ముగ్గుల పోటీ

వెంకటాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం ప్రపంచ ఫంగస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావు విచ్చేశారు. రంగురంగుల ముగ్గులను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, డాక్టర్ జీ మేరీ సందీప, డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, జీ విజయానంద్‌కుమార్ బాబు, డాక్టర్ కే విద్యాప్రభాకర్, డాక్టర్ జీ విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పనితీరుపై అవగాహన

విడవలూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. హెచ్‌సీ సునీల్ మాట్లాడుతూ పోలీసులు సెట్ కాన్ఫరెన్స్‌లో ఎలా మాట్లాడుతారు, ఫిర్యాదులను ఎలా దర్యాప్తు చేస్తారు. తదితర విషయాలను తెలియచేశారు.

సంకల్ప బలంతో నవసమాజం



రామచంద్ర శరత్‌ను సత్కరిస్తున్న ఎంపీడీవో, తహసీల్దారు తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి):సంకల్ప బలంతోనే నవసమాజాన్ని స్థాపించగలమని, ఇందుకు నార్త్ ఆములూరు వద్ద నున్న చైల్డ్ ఆశ్రమం నిర్వాహకుడు రామచంద్ర శరత్ నిదర్శనమని ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దారు వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో రామచంద్ర శరత్ 'పవర్ ఆఫ్ పాజిటివ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీతోపాటు మండలంలోని అన్ని సచివాలయాల అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం రామచంద్ర శరత్‌ను ఎంపీడీవో, తహసీల్దారు, ఈవోపీఆర్డీలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

రూ. 58వేల విరాళం




విరాళం చెక్కును అందిస్తున్న దాతలు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జయభారత్ ఆసుపత్రికి భగవాన్ మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జేపీ జైన్, సభ్యుడు మిశ్రమల్ జైన్ రూ. 58 వేల విరాళం అందించారు. ఆసుపత్రిలో డెలివరీ గది కోసం ఈ మొత్తాన్ని వైద్యశాల డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, కృష్ణారెడ్డికి అందజేశారు.

పాఠశాలను పునఃప్రారంభించాలి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సెయింట్ పీటర్, సెయింట్ జోసఫ్ పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కలెక్టర్ ఆనంద్‌ను కోరారు. జనవాణి ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో భాగంగా శనివారం సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆ రెండు పాఠశాలలను గత ప్రభుత్వంలో మూసివేయడం తో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించాలని కోరారు.



సనాతనం.... సాధు, సంతుల స్వాగతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రకటించిన సనాతన ధర్మపరిషత్‌ను సాధు, సంతులు స్వాగతించారు. తిరుపతిలో శనివారం జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సులో ఆరు రాష్ట్రాలకు చెందిన వందలాదిమంది సాధువులు, మఠాధిపతులు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు, తిరుక్షేత్రాల రక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

- 6లో



విహంగ గానం

వాన కురిస్తే ప్రకృతి పరవశిస్తుంది. చెట్టూ పుట్టా పిట్టా పురుగూ.. సమస్తమూ సంతోషంతో కళకళలాడుతాయి. తడిచిన రెక్కలు ఆరబెట్టుకుంటూ, ఊసులు చెప్పుకుంటూ, గూళ్లు అల్లుకుంటూ.. ఈ అందాల రెక్కల లోకాన్ని మీరూ ఆస్వాదించండి..

- 6లో



కార్తీక్ మ్యాజిక్

తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో యువ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ షో యువతను ఉర్రూతలూగించింది. భారీసంఖ్యలో హాజరైన యువతీయువకుల ఈలలు, చప్పట్లతో స్టేడియం మార్మోగింది.

- 6లో



ఉల్లం'ఘనుల'పై కొరడా

- 327మంది మైనింగ్ డీలర్లపై అభియోగాల నమోదు.. 72మందికి క్లీన్ చిట్
- నివేదికలు సిద్ధం చేసిన అధికారులు



మైకా క్వార్ట్జ్ గ్రేడింగ్



'జే ట్యాక్స్'తో పర్మిట్ పొందిన వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

గూడూరు(అర్బన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా రెచ్చిపోయిన సిలికాసురులు, గనులు మింగిన వారిపై కొరడా ఝుళిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా భూగర్భ, గనుల శాఖ అధికారులు వారం రోజులుగా అక్రమార్కుల చిట్టాను తయారు చేయడంలో తలమునకలై ఉన్నారు. ముందుగా ఎం.డి.ఎల్(మైనింగ్ డీలర్స్ లైసెన్స్) అక్రమార్కులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అనుమతుల్లేని చోట్ల అక్రమంగా ఖనిజాల సేకరణ, ప్రభుత్వ రాయల్టీకి మించి కట్టిన '.జే'ట్యాక్స్‌తో పొందిన పర్మిట్లు, లెక్కకు మించిన ఖనిజాల నిల్వలపై లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. 300 సిలికా సాండ్, క్వార్ట్జ్, గ్రావెల్ మైనింగ్ డీలర్లపై శాఖాపరమైన చర్యలు తప్పనిసరిగా తెలుస్తోంది. అలాగే మైనింగ్ లీజులను గలీజుగా మార్చిన మరికొంత మంది గనుల యజమానులపైనా ఉల్లంఘనలను బట్టి చర్యలు తీసుకోనున్నారు. గూడూరు, నాయుడుపేట డివిజన్లలో మొత్తం 399 ఎం.డి.ఎల్‌లకు సిలికా సాండ్, క్వార్ట్జ్, గ్రావెల్ తదితర ఖనిజాల గ్రేడింగ్, రవాణా కోసం భూగర్భ, గనుల శాఖ నుంచి అనుమతులున్నాయి. వీటిలో 72 ఎం.డి.ఎల్‌లకు మైనింగ్ అధికారులు క్లీన్‌చిట్ ఇచ్చారు. 327 మంది మైనింగ్ డీలర్లపై వివిధ రకాల అభియోగాలను నమోదు చేసి, ప్రభుత్వానికి పంపారు. వీరిపై తదుపరి చర్యల కోసం అధికారులు వేచి చూస్తున్నారు. క్లీన్‌చిట్ అందుకున్న డీలర్లకు ఖనిజాల రవాణా పర్మిట్లను అందించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. నిబంధనలను స్వల్పంగా అతిక్రమించిన వారికి తగిన జరిమానా విధించి ఆపై రవాణా అనుమతులు ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు సూత్రప్రాయంగా వెల్లడించాయి. అభియోగాలు తీవ్రంగా ఉన్న డీలర్లపై కఠినంగా వ్యవహరించే అవకాశముంది.

గనుల యజమానులపైనా చర్యలు..

గీత దాటిన మైనింగ్ యజమానులపై చర్యలకు గూడూరు అధికారులు తలమునకలై ఉన్నారు. మైనింగ్ డీలర్లపై చర్యల అనంతరం వారిపై దృష్టి సారించనున్నారు. గూడూరు డివిజన్‌లోని కోట, చిల్లకూరు మండలాల్లో 80 సిలికా గనులు, చిల్లకూరు, గూడూరు రూరల్ మండలాల్లో 15 క్వార్ట్జ్, మైకా(అభ్రకం), ఫెల్స్‌పర్ గనులు 5 వర్మ్యుఖ్ లైట్ గనుల్లో నుంచి ఖనిజాల వెలికితీతకు ప్రభుత్వ అనుమతులున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న 2019-24 మధ్య కాలంలో, ఎక్కువగా 2023-24కాలంలో వైసీపీ నాయకుల అండతో అనుమతులు ఉన్న గనులతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఇష్టారాజ్యంగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ అనుమతులు ఉన్న గనుల నుంచి పర్మిట్లను డ్రా చేసి అక్రమ రవాణాకు ఉపయోగించినట్లు మైనింగ్ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దీనిపై సమగ్ర విచారణ కొనసాగుతోంది. రెండు మూడు రోజుల్లో పూర్తి నివేదికలను ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నివేదికలు సిద్ధం

గూడూరు డివిజనల్ భూగర్భగనులశాఖ పరిధిలోని 14 మండలాల్లో ప్రధానంగా కోట, చిల్లకూరు, గూడూరు రూరల్ మండలాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై నివేదికలు దాదాపు సిద్ధం చేసినట్లు డివిజనల్ భూగర్భ, గనుల శాఖ అధికారి కె.శ్రీనివాసరావు వెల్లడించారు. ఎండీఎల్‌లో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తి కాగా మైనింగ్ లీజుల్లో జరిగిన ఉల్లంఘనలపై సోమవారం కల్లా నివేదికలను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో మైనింగ్ ద్వారా తమ డివిజన్‌లో ప్రభుత్వానికి రూ.77కోట్లు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

తిరుపతిలో హోటళ్లకు మళ్లీ బాంబు బెదిరింపు

- డాగ్, బాంబు స్క్వాడ్‌ల తనిఖీలు
- నకిలీ మెయిల్స్ అని తేల్చిన పోలీసులు





హోటల్లో తనిఖీలు చేస్తున్న బాంబు, డాగ్ స్క్వాడ్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పలు హోటళ్లకు శనివారం మళ్లీ బాంబు బెదిరింపులు వచ్చాయి. కపిలతీర్థం సమీపంలోని రాజ్ పార్కు హోటల్ మేనేజర్ సుశాయ్‌కు తెల్లవారుజామున 5.32 గంటలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఆయన అలిపిరి సీఐ రాంకిషోర్‌కు సమాచారం అందించారు. అదే ప్రాంతంలోని మరో రెండు, ఈస్ట్ స్టేషన్ పరిధిలో ఒకటి, రూరల్ పరిధిలోని తాజ్ హోటల్‌కూ బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు వెంటనే హోటల్స్ వద్దకు చేరుకున్నాయి. రాజ్ పార్కు హోటల్ వెలుపల పార్క్ చేసి ఉంచిన జమ్మూకాశ్మీర్ రిజిస్ట్రేషన్ కారును తనిఖీ చేశారు. అలాగే రష్యన్లు, మలేషియా వాసులు బసచేసే గదులపై ప్రత్యేక దృష్టి సారించి అడుగడుగునా తనిఖీలు చేసి, ఎలాంటి బాంబులూ లేవని తేల్చారు. మిగిలిన హోటళ్లనూ తనిఖీ చేసి ఫేక్ మెయిల్స్ అని నిర్ధారించుకున్నారు. రెండు రోజుల వ్యవధిలో రెండు సార్లు నాలుగు హోటళ్లకు, తిరుపతి విమానాశ్రయంలో స్టార్ ఎయిర్ లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో జిల్లా పోలీసు యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించింది.

ఫేక్ మెయిల్స్‌పై లోతైన దర్యాప్తు : ఎస్పీ

తిరుపతిలోని పలు హోటళ్లకు ఫేక్ మెయిల్స్ రావడం పట్ల లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆయా హోటళ్ల మేనేజర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ చట్టం 353 క్లాస్ వన్, క్లాస్ బీ, 351 క్లాస్ 4 కింద ఆరు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. బాంబు బెదిరింపుల వెనుక పాక్ తీవ్రవాదుల హస్తముందా? లేకుంటే వారి పేర్లతో ఫేక్ మెయిల్స్ పెట్టి భక్తులను భయాందోళనకు గురిచేస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మెయిల్స్ వచ్చిన ఐడీలు, ఫోన్ నంబర్ల ఆధారంగా నిందితులను గుర్తించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విషయంలో నగర ప్రజలు భయపడాల్సిన పనిలేదని, అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.



తిరుపతిలో సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహయాదవ్

టీడీపీ సభ్యత్వ నమోదు షురూ

- పాల్గొన్న ఎమ్మెల్యేలు,పార్టీ నాయకులు

తిరుపతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. తిరుపతిలోని పార్టీ పార్లమెంటు కమిటీ కార్యాలయంలో అధ్యక్షుడు నరసింహ యాదవ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తన సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జీవకోన ప్రాంతంలోని రాజీవ్‌గాంధీ కాలనీ గంగమ్మ ఆలయం వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో కలసి మాజీ ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జి సుగుణమ్మ ప్రారంభించారు. గూడూరులో తన క్యాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును లాంఛనంగా మొదలుపెట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి నాయుడుపేటలోని టీడీపీ ఎమ్మెల్యే విజయశ్రీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆరంభించగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యంతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఎర్రావారిపాలెం మండలం పసుపులేటివారిపల్లిలో ఎమ్మెల్యే పులివర్తి నానీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టగా ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి పాకాలలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు.వారిద్దరూ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గం విషయానికొస్తే శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరు, అక్కుర్తి గ్రామాలతో పాటు రేణిగుంటలోనూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సభ్యత్వ నమోదు ప్రక్రియను మొదలుపెట్టారు.

నకిలీ సభ్యత్వాలను రద్దు చేయాలి

శ్రీకాళహస్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ విధానాన్ని దుర్వినియోగం చేస్తూ కొందరు సృష్టిస్తున్న నకిలీ టీడీపీ సభ్యత్వాలను రద్దు చేయాలని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు గుట్టుచప్పుడు కాకుండా టీడీపీ సభ్యత్వాలు స్వీకరించడంపై ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో టీడీపీని ఓడించడమే ధ్యేయంగా పనిచేసిన కొందరు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో టీడీపీ సభ్యత్వాలను పొందుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పక్కదారిపడుతున్న టీడీపీ సభ్యత్వాలపై పార్టీ అధిష్టానం దృష్టిసారించి నకిలీవి గుర్తించి రద్దు చేయాలని కోరారు.

నగరి, సత్యవేడుల్లో ప్రారంభించిన స్థానిక నేతలు

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంత్రి నారా లోకేశ్‌తో కలసి విదేశీ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ మండల స్థాయి నేతలు ఉత్సాహంగా సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పుత్తూరు పట్టణంలో పార్టీ సీనియర్ నేత మునివరత్నం నాయుడు, రూరల్ మండలంలో మరో సీనియర్ నేత గంజి మాధవయ్య సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. ఇక సత్యవేడు విషయాకొస్తే పార్టీ అధిష్టానం సస్పెన్షన్ విధించిన నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనలేదు. నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతిబాబు సత్యవేడులో మెంబర్‌షిప్ ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రారంభించారు. అలాగే సత్యవేడు మండలం వీఆర్ కండ్రిగ, మదనంబేడు గ్రామాల్లో కూడా పాల్గొన్నారు. కాగా జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలాల్లో కూడా తొలిరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జోరుగా మొదలయ్యాయి. స్థానిక నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి రోజు కొత్త సభ్యత్వాలు తక్కువగా నమోదు కాగా ఇప్పటికే సభ్యులుగా ఉన్న వారు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవడం ఎక్కువగా కనిపించింది.



పసుపులేటివారి పల్లెలో సభ్యత్వ నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే నాని

డీఈవో బాధ్యతల స్వీకరణ



డీఈవోను సత్కరిస్తున్న అప్సా నాయకులు

తిరుపతి(విద్య), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):జిల్లా విద్యాశాఖాధికారిగా కె.వెంకటనాగేంద్ర కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కార్వేటినగరం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ ఇప్పటివరకు జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్యాశాఖాధికారుల బదిలీల్లో భాగంగా మదనపల్లి ఉప విద్యాశాఖాధికారిగా నియమితులైన వెంకటనాగేంద్ర కుమార్‌కు తిరుపతి జిల్లా డీఈవోగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆయన శనివారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో పూర్వ డీఈవో శేఖర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. నూతన డీఈవోను ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

డక్కిలిలో రెవెన్యూ రికార్డులు మార్చేశారు

డక్కిలి, అక్టోబరు 26 : (ఆంధ్రజ్యోతి) : డక్కిలి మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు గోల్‌మాల్ అయ్యాయని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ గద్దల మునెయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం తహసీల్దార్ ఎం.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. 2003 నుంచి 2024 వరకు రెవెన్యూ రికార్డుల మార్పిడిలో గోల్‌మాల్ జరిగిందన్నారు. రైతులకు సంబంధించిన భూముల రికార్డులు మారిపోయినట్లు తెలిపారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రమేష్‌బాబు, తీర్థంపాడు సచివాలయ సెక్రటరీ కార్తీక్, అటెండర్ వనిత భూమాయ చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బోగస్ ఎపిక్ కార్డులుంటే వెంటనే వెనక్కివ్వండి

- తిరుపతిలో అక్రమ డౌన్‌లోడింగ్ నిర్ధారణ అయిందన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బోగస్ ఎపిక్‌కార్డులు తయారు చేసినా లేదా కలిగి ఉన్నా శిక్ష తప్పదని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 39,251 ఎపిక్ కార్డుల(ఓటరుకార్డులు) డేటాను అనధికారికంగా డౌన్‌లోడ్ చేసినట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. బోగస్ ఎపిక్‌కార్డుల ద్వారా 2021లో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో అక్రమంగా ఓట్లు వేయడానికి ప్రయత్నించారని స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే పలువురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని, కేసులు కూడా నమోదు చేశామని తెలిపారు. బోగస్ ఎపిక్‌కార్డులు కలిగి ఉన్న వ్యక్తులు వెంటనే వాటిని తిరుపతి అసెంబ్లీ ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్‌కు కానీ, కలెక్టర్ కార్యాలయంలో కాని అప్పజెప్పాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ వెంకట్రావు

పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్ ప్రదర్శన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకట్రావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం తిరుపతిలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. అమరులైన పోలీసులకు అంజలి ఘటించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను ప్రజలందరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం ఓపెన్ హౌస్‌లో ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు, పరికరాలు, వాటి పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సాయుధ దళం శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పులి కాదండోయ్.. మేకపోతు

జీవకోన రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలోని ఓ మాంస దుకాణం వద్ద శనివారం పులితోలు కప్పుకున్నట్లు ఉన్న ఒక మేకపోతు కనిపించింది. చూడ్డానికి అచ్చం పులిలా ఉంది. శరీరమంతా పులిమచ్చలు ఉన్న ఈ మేకపోతు చూపరులను ఆకట్టుకుంది. ఇది శిరోహి జాతి మేకపోతని, ఒకప్పుడు రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకునేవారని, ప్రస్తుతం చుట్టుపక్కల పల్లెల్లోనే లభ్యమవుతున్నాయని దుకాణం యజమాని తెలిపారు.

- తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి
















వాన కురిస్తే ప్రకృతి పరవశిస్తుంది. చెట్టూ పుట్టా పిట్టా పురుగూ.. సమస్తమూ సంతోషంతో కళకళలాడుతాయి. శేషాచలం అడవులు అనేకానేక రకాల పక్షులకు ఆవాసాలు. ఈ కొండబారు వెంబడే ఉన్న తిరుపతి నగర పరిసరాల్లోనూ పిట్టలు తారసపడుతూ ఉంటాయి. వాన కురిసి వెలిసిన వేళ.. నగరంలోనూ, శివారు పల్లె ప్రాంతాల్లోనూ ఆంధ్రజ్యోతి తిరుమల ఫొటోగ్రాఫర్ కెమెరా కంటబడ్డ రకరకాల పక్షుల చిత్రాలు ఇవి. రామచిలుకలు, వడ్రంగి పిట్టలు, పిచుకలు, గిజిగాడు, పసలపోలుగాడు.. వంటి ఎన్నో రకాలు సందడిచేస్తూ కనిపించాయి. తడిచిన రెక్కలు ఆరబెట్టుకుంటూ, ఊసులు చెప్పుకుంటూ, గూళ్లు అల్లుకుంటూ.. ఈ అందాల రెక్కల లోకాన్ని మీరూ ఆస్వాదించండి..

- ఆంధ్రజ్యోతి, తిరుమల












విహంగ గానం















కేక పుట్టించిన

మ్యూజిక్ షో





తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శనివారం జరిగిన యువ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ ప్రదర్శన యువతను కేరింతలు పెట్టించింది. అరవాన్ తమిళం, తెలుగులో ఏకవీర సినిమాకు సంగీతం కూడా అందించిన కార్తీక్ పాటలకు యువత భారీగా స్పందించింది. మహాగణపతి ప్రార్థనతో సంగీత విభావరి ప్రారంభమైంది. గజినీ సినిమాలోని ఒక మారు కలిసిన బంధం పాటతో ఉత్సాహం తారస్థాయికి చేరుకుంది. అరరె అరెరే మనసే జారే, ఉసురే పోయెను, సీతాకోకా నచ్చావే వంటి పాటలకు మంచి స్పందన




లభించింది. స్టేడియం అంతా యువోత్సాహం కనిపించింది. ముఖ్యంగా యాంకర్ ప్రశ్నలకు యువతీయువకులు ఉత్సాహంగా స్పందించారు. కార్తీక్ పాడిన పాటలను హమ్ చేశారు. రెండు గంటలకు పైగా సాగిన సంగీత విభావరి యువతను ఉర్రూతలూగించిందని చెప్పవచ్చు. కాగా ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో ప్రేక్షకులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. భారీ ధరలతో టికెట్లు కొన్నవారికి కూడా సరైన సీటింగ్ వసతి లేకపోవడంతో మహిళలు కూడా నిలబడే షో చూడాల్సి వచ్చింది. పార్కింగ్ కోసం సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. పాసుల విషయంలోనూ గందరగోళం నెలకొంది.

సనాతన ధర్మ పరిషత్‌కు సాధు, సంతుల మద్దతు

తిరుపతిలో మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలని విజ్ఞప్తి

తిరుపతి (కల్చరల్), అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రస్తావిస్తున్న సనాతన ధర్మపరిషత్ ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు పలువురు సాధు, సంతులు ప్రకటించారు.తిరుపతిలో శనివారం జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సులో పాల్గొన్న ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణకు, అక్రమ మత మార్పిడుల నివారణకు, ఆలయాల నిర్వహణకు, ధర్మ పరిరక్షణకు సనాతన ధర్మపరిషత్ ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. జాతీయ స్థాయిలో ఇటువంటి బోర్డు ఏర్పాటుకు కృషిచేయాలని సాధువులు, పీఠాధిపతులు, మఠాధిపతులు విజ్ఞప్తి చేస్తున్నారని, ఇందుకోసం ప్రయత్నిస్తున్న ఏపీ ఉపముఖ్యమంత్రికి తాము మద్దతుగా నిలుస్తామన్నారు. రాష్ట్రంలో గత పాలకులు ఆలయాలను నిర్వీర్యం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని చక్కదిద్దేప్రయత్నం చేస్తోందన్నారు. దేవస్థానాల పాలకమండళ్లలో తప్పనిసరిగా సాధువుల నుంచి ఒకరికి సభ్యత్వం ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు.ఇతర మతస్థులకు మక్కా, వాటికన్ నగరాల మాదిరిగా హిందువులకు తిరుపతిని పవిత్ర పుణ్యక్షేత్రంగా గుర్తించాలని, ఇక్కడ మద్యం, మాంసం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని సదస్సు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. **హిందువులకు వేంకటేశ్వరస్వామి ఆరాధ్య దైవమని, ఆయన సన్నిధిలో అన్యమతస్థులు పనిచేయడాన్ని అరికట్టాలని కోరింది.** ఏపీ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, తెలంగాణ సాధుపరిషత్ అధ్యక్షుడు శివానంద స్వామి, శంకర స్వామి, దేవానంద జీయర్, కామాఖ్యాపీఠానికి చెందిన భైరవ్ గౌరవ్ స్వామి, నిరంజన్, తుమ్మా ఓంకార్ తదితరులు ప్రసంగించారు. రోజంతా జరిగిన ఈ ధార్మిక సదస్సులో 6 రాష్ట్రాలకు చెందిన మూడు వందలకు పైగా సాధువులు, మఠాధిపతులు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు, భక్తులు, తిరుక్షేత్రాల రక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ హిందూ . ధార్మిక సదస్సులో పాల్గొన్న సాధు, సంతులు

రేపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తిరుపతి రాక

తిరుపతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈనెల 28వ తేదీన తిరుపతి రానున్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా సోమవారం తిరుపతి చేరుకోనున్న రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ తొలిరోజు కూటమి పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. మరుసటి రోజు జిల్లా అభివృద్ధి విషయమై కలెక్టర్‌తో సమీక్షించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుచానూరు రోడ్డులోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీల ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. మంగళవారం కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రాజెక్టులు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై దిశా నిర్దేశం చేయనున్నారు.

టీడీపీ కార్యకర్త హత్య కేసులో 14 మంది అరెస్ట్

చిల్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ హత్య కేసులో 14 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్పీ రవిమనోహరచారి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ వివరాలు వెల్లడించారు. ఈనెల 22వ తేదీన వేకువన గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు గ్రామంలోని హరిజనవాడకు చెందిన కొంతమందితో కలిసి అరుంధతీయవాడకు చెందిన టీడీపీ కార్యకర్తలైన కాటయ్య, హరిప్రసాద్‌లను హత్యచేసేందుకు కుట్రపన్నారన్నారు. కాటయ్య, హరిప్రసాద్ ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి ముందు ఉన్న మోటారుసైకిల్‌ను పెట్రోలు పోసి తగలబెట్టారన్నారు. కాటయ్య, హరిప్రసాద్ నిద్రిస్తున్న ఇంట్లోకి పెట్రోల్ సీసాలకు నిప్పంటించి వారిపై విసిరి హత్యాయత్నం చేయగా కాటయ్య, హరిప్రసాద్ మంటలను తట్టుకోలేక బయటకు రావడంతో వారిపై కత్తులతో దాడి చేశారన్నారు.



పట్టుపడిన నిందితులతో ఏఎస్పీ రవిమనోహరచారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు

కాటయ్య సమీప పొలాల్లోకి పారిపోగా హరిప్రసాద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. హరిప్రసాద్ హత్యకేసులో నిందితులైన మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కట్టా రామిరెడ్డి, నాంచారమ్మపేట గ్రామానికి చెందిన దుంపాల మధుకుమార్, దుంపాల డేనియల్, మన్నెం మోజేస్, ముత్యాలపాడు గ్రామానికి చెందిన చిట్టెటి దినేష్‌రెడ్డి, నాంచారమ్మపేట గ్రామానికి చెందిన మన్నెం శీనయ్య, మన్నెం మనెయ్య, దుంపాల సాయికృష్ణ, పనబాక మనోజ్‌కుమార్, కోట మండలం వంజివాక గ్రామానికి చెందిన పామల విష్ణు, తిమ్మినాయుడుపాళెం గ్రామానికి చెందిన కడూరు విశాల్, అల్లంపాడు గ్రామానికి చెందిన దుంపాల ఏసు, చిల్లకూరు మండలం నాంచారమ్మపేటకు చెందిన దుంపాల చెంగమ్మ, ముత్యాలపాడుకు చెందిన నారపరెడ్డి వెంకటకృష్ణారెడ్డిలను అరెస్ట్ చేశామని వివరించారు. మండలంలోని చింతవరం- కోట రోడ్డులో ఏడుగురిని, ముత్యాలపాడు సమీపంలోని ఏఎంసీ గోదాము వద్ద ఏడుగురిని అరెస్ట్ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమణకుమార్, చెంచుబాబు, సీఐలు కిషోర్‌బాబు, హుస్సేన్‌బాషా, శేఖర్‌బాబు, బాబి, మురళీకృష్ణ, ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

గ్రామస్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేద్దాం : విజయశ్రీ



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే విజయశ్రీ పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయశ్రీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో లక్షా 40వేలు సభ్యత్వ నమోదు లక్ష్యంగా పనిచేస్తామన్నారు. టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రఫీ, కృష్ణయ్య, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, విజయకుమార్‌నాయుడు, అరవ పెరిమిడి చంద్రారెడ్డి, గంగాప్రసాద్, గూడూరు సుధీర్‌రెడ్డి, సుబ్బారావు, నారాయణ, రవి, సుధీర్ ఉన్నారు.

నీ స్థాయి మరిచి మాట్లాడితే సహించం

● వైసీపీ నేత కామిరెడ్డికి టీడీపీ శ్రేణుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థాయిని మరిచి సీఎం చంద్రబాబును, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శిస్తే సహించబోమని వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఘాటుగా హెచ్చరించారు. శనివారం కొత్తూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు పాపాడి రాజగోపాల్ రెడ్డి, దామెర ప్రసాద్‌నాయుడు, వట్టికుండల శేఖర్‌నాయుడు, శాఖమూరి కృష్ణమనాయుడు, యాగాని బెన్నీలతో కలసి మాట్లాడారు. గత ఐదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని మట్టి, గ్రావెల్‌ను దోచుకున్న నీలాంటి వారికి చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. దోపిడీ, దౌర్జన్యం, విధ్వంసంతో పాలన సాగించడం తప్ప ప్రజలకు వైసీపీ చేసింది శూన్యమన్నారు. పెళ్లకూరు మండలం టీడీపీకి కంచుకోట అని గతంలో వైసీపీ పాలనలో 12 సర్పంచుల స్థానాలకు 10 మందిని గెలుచుకున్నామని గుర్తుచేశారు. ఎంపీటీసీ, జట్పీటీసి ఎన్నికల్లో అభ్యర్థులను నామినేషన్ వేయకుండా అడ్డుకున్న విష సంస్కృతి నీదేనని తెలియజేశారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సిద్ధులయ్య నాయుడు, మురళీ నాయుడు, రవినాయుడు, మునికృష్ణారెడ్డి, యుగంధర్‌గౌడ్, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఉదయ్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, గురవారెడ్డి, వేణురెడ్డి, గురవయ్య, పరుశురాం, రవి, చంద్రయ్య, జనసేన నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీఎస్ఆర్‌లో జంతు దినోత్సవం

గూడూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్ఆర్ పాఠశాలలో శనివారం జంతువుల దినోత్సవం నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు వివిధ జంతువుల వేషధారణలో దుస్తులు ధరించి నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణంరాజు, అన్నపూర్ణ, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సర్కిల్ కార్యాలయం తనిఖీ

నాయుడుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అడిషనల్ ఎస్పీ రవిమనోహర్‌ఆచారి శనివారం తనిఖీ చేశారు. డీఎస్పీ చెంచుబాబు, అర్బన్, రూరల్ సీఐలు బాబి, సంఘమేశ్వరరావు ఉన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెదమాంబట్టు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం జరిగింది. కుంభాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్విమ్స్ వైద్యులు మునస్వామి, గ్రామ పెద్దలు వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలుర హాస్టల్ తనిఖీ

తడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టు బీసీ బాలుర వసతిగృహాన్ని సూళ్లూరుపేట న్యాయమూర్తి అనూష శనివారం తనిఖీ చేశారు.

నీటి పన్ను చెల్లించండి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని నీటి కుళాయి పన్నును అందరూ సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తెలిపారు. శనివారం ఆయన సాయినగర్, కసారెడ్డిపాలెం ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్లను పరిశీలించారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడే ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశమేనని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఓటర్లలో ప్రతి నలుగురిలో ఒకరు తప్పనిసరిగా టీడీపీ సభ్యత్వం తీసుకునేలా క్లస్టర్ ఇన్‌చార్జులు కృషిచేయాల న్నారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, దశరథ రామిరెడ్డి, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, పెంచలయ్య, కోటేశ్వరరావు, నరసిం హులు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణ దానం : ఎమ్మెల్యే కురుగొండ్ల



రక్తదానం చేసిన కానిస్టేబుల్‌కు జ్యూస్ అందిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీసులు ఏర్పాటు చేసిన ర్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తం దానం చేసిన 103 మందిని, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన సీఐ రమణను, ఎస్ఐ సుబ్బారావు, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరామదాసు గంగాధర్, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, కేవీకే ప్రసాద్‌నాయుడు, భీరం రాజేశ్వరావు, కాపా శ్రీనివాసుల నాయుడు, తాండవ చెంద్రారెడ్డి, నరసింహులు, సుదా, మల్లారం బాబు, చెంగారావు, జనసేన పార్టీ నాయకులు తోటా రామచంద్రయ్య, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గూడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం అన్నారు. శనివారం స్థానిక బీసీ బాలికల గురుకుల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.

సీఎంను కలిసిన కొండేపాటి, వాకాటి



సూళ్లూరుపేట, అక్టోబరు 26: ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు ను మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, నామినేటెడ్ పదవులు, నియోజకవర్గ అభివృద్ధి తదితర వాటిపై చర్చించినట్లు తెలిసింది.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని వర్కర్లకు, సేంద్రియ ఎరువుల వాడకం, దిగుబడులపై అవగాహన కల్పించారు.



మద్దాలిలో పల్లె పండుగ

కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మద్దాలిలో శనివారం పల్లెపండుగ వారోత్సవాలు జరిగాయి. మినీగోకులాల పని తీరును పరిశీలించారు. ఉపాధి హామీ పథకం క్వాలిటీ కంట్రోల్ జేఈ సతీష్‌బాబు, ఏపీవో పూర్ణిమ, ఎంపీడీవో వేణు ఆయా పనులను పరిశీలించారు. యానిమల్స్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్థానిక గిరిజన కాలనీలో ఉన్న సీసీ రోడ్డును ప్రారంభించారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు..యువకుడికి గాయాలు

కోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కోటకు చెందిన యువకుడు విద్యానగర్ పెట్రోలు బంకు సమీపంలో వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. అతడిని కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

లక్ష్యసాధనకు ప్రతి కార్యకర్తా కృషిచేయాలి

వెంకటగిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యసాధనకు ప్రతి ఒక్క కార్యకర్తా కృషిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని సూళ్లూరుపేట పోలీస్టేషన్‌లో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నోవా బ్లడ్ బ్యాంక్, పోలీసుల ఆధ్వర్యంలో జగిరిన రక్తదాన శిబిరాన్ని సీఐ మురళికృష్ణ ప్రారంభించారు. పోలీసులు,విద్యార్థులు, ఆటో వర్కర్స్ రక్తదానం చేశారు.ఎస్ఐలు బ్రహ్మనాయుడు, శ్రీకాంత్, నోవా బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రిక్షా కార్మికుడి మృతి

నాయుడుపేట టౌన్: స్థానిక సంజాయ్ గాంధీ కాలనీకి చెందిన రిక్షా కార్మికుడు సుబ్రహ్మణ్యం (50) తుమ్మూరు సమీపంలో నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనిమృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

చిల్లకూరు,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోట క్రాస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. శనివారం రాత్రి చెన్నై నుంచి నెల్లూరు వైపు వస్తున్న లారీ కోట క్రాస్ రోడ్డులో సడన్‌గా పంక్చరై అదుపుతప్పింది. ఆ సమయంలో వెనకు వస్తున్న మరో లారీ పంక్చరైన లారీని ఢీకొంది. ఈ ఘటనలో వెనుక వస్తున్న లారీలోని డ్రైవర్ శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడిది తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా. పోలీసులు మృతదేహాన్ని గూడూరు ఆస్పత్రికి తరలించారు.



